www.prajamantalu.com
Praja mantalu, Jagtial

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 06 వెల - రూ. 5 : 00

బుధవారం 06 మార్చి 2024

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న మోడీ

ప్రధాని రాక సందర్భంగా సికింద్రాబాద్‌లో భారీ భద్రత

రెండోరోజు తెలంగాణలో పర్యటిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



2లో..

## ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

మావోయిస్ట్ సంబంధాలను తోసిపుచ్చిన హైకోర్టు

నిర్దోషిగా విడుదల చేస్తూ ఆదేశాలు

వార్త 2లో

## తన వారెవరూ ఎన్నికల్లో పోటీచేయరు

తమ్ముళ్ల రాజకీయ ప్రవేశ ప్రచారానికి రేవంత్ తెర

అభివృద్ధి కోసం ఎవరు కలిసినా తప్పలేదు

ఎమ్మెల్యేలు కలిస్తే రాజకీయాలు అల్లడం సరికాదు

మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

2లో



## పాక్, ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ హిమపాతం

36 మంది మృతి, 43 మందికి గాయాలు



వార్త 2లో


## బెంగుళూరు పేలుడు కేసు దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

3లో

## సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోకు కాంగ్రెస్ కసరత్తు

- నిరుద్యోగ సమస్యకు పరిష్కారమే లక్ష్యంగా రూపకల్పన

## ప్రజా నాడి




# అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒక్కటే..



## కాళేశ్వరమే ఇందుకు ప్రబల ఉదాహరణ

- వరుసగా రెండోరోజూ కాంగ్రెస్‌పై విమర్శలు
- సంగారెడ్డి వేదికగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రజలంతా నాకుటుంబ సభ్యులే అన్న ప్రధాని మోడీ

**సంగారెడ్డి, మార్చి 5 (ప్రజా మంటలు):** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అందులో భాగస్వామి అవుతోందని ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. అవినీతిలో బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒక్కటేనని వరుసగా రెండోరోజూ తెలంగాణ వేదికగా ప్రధాని మోడీ విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోందని కాంగ్రెస్‌పై సంగానరెడ్డి వేదికగా విమర్శలు గుప్పించారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. సోమవారం మిగతా 2లో..

## రాష్ట్రాలను లూటీ చేస్తున్న కుటుంబ పార్టీలు

- కుటుంబ పాలనకు నేను పూర్తిగా వ్యతిరేకం
- దేశ ప్రజలే నా కుటుంబం అన్న ప్రధాని
- భారత్‌ను మూడో ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతా
- సంగారెడ్డి సభలో విపక్షాలను ఏకిపారేసిన మోడీ

వార్త 2లో



## ముగిసిన ప్రధాని మోడీ రెండ్రోజుల పర్యటన

హైదరాబాద్ నుంచి ఒడిషా కు వెళ్లిన మోడీ

బేగంపేటలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం రేవంత్

వార్త 2లో



## నేటికీ మంచినీటికి నోచుకోని పదిలక్షల ఆవాసాలు

- తెలంగాణలో గ్రామీణ నీటి సరఫరాకి సహకరించండి
- జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించాలి
- ప్రధాని మోడీకి వినతిపత్రం అందచేసిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు):** రెండు రోజుల తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంవాలకు సంబంధించి విజ్ఞప్తులు అందచేశారు. వాటిని సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో నూటికి మిగతా 2లో..

## మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- లోక్‌సభకు మరో భారాస అభ్యర్థిని ఖరారు చేసిన కేసీఆర్



**హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు):** మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ నేతలతో భారాస అధినేత కేసీఆర్ సమావేశం ముగిసింది. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ప్రకటించారు.నాగర్ కర్నూల్ అభ్యర్థిత్వం ఇంకా ఖరారు కాలేదు. బీఎస్పీతో పొత్తు నేపథ్యంలో ఆ స్థానం నుంచి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కష్టకాలంలో పార్టీ నుంచి వెళ్తున్న వారిని మళ్లీ చేర్చుకోవద్దని నేతలు కోరారు. దీనిపై స్పందించిన అధినేత కేసీఆర్.. వారిని మళ్లీ తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యులతో చర్చించి నాగర్ కర్నూల్ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు.

## గులాబీతోటలో చేరిన ఏనుగు



3లో

- కలసి పోటీ చేయాలని బిఆర్ఎస్, బిఎస్పీ నిర్ణయం
- కెసిఆర్‌తో బిఎస్పీ అధినేత ప్రవీణ్ కుమార్ చర్చలు
- కలసి ఎన్నికల్లో పోటీకి దిగుతామన్న కెసిఆర్
- మాయావతితో మాట్లాడుతానన్న వెల్లడి

## కాళేశ్వరంపై కెసిఆర్‌ను బద్నాం చేసే కుట్ర

పిల్లర్లు కుంగితే రిపేరు చేసి నీళ్ళివ్వ వచ్చు కదా

బతుకమ్మ చీరలకు ఎందుకు ఆర్డర్ ఇవ్వడం లేదు

బిఆర్ఎస్ సమావేశంలో కెటిఆర్ విమర్శలు



**రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (ప్రజా మంటలు):** మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని మిగతా 3లో..

## నేడు మేడిగడ్డ సందర్శనకు ఎన్డీఎస్ఏ

వార్త 3లో

## భారత్‌లో మైనార్టీలపై వివక్ష.. విమర్శకులపై దాడులు

- మానవ హక్కుల పరిరక్షకులు, పాత్రికేయులపై పరిమితులు
- ఆందోళన వ్యక్తం చేసిన ఐరాస

**హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు):** కొద్దివారాల్లో మనదేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రక్రియపై ఐరాస మానవహక్కుల విభాగం అధిపతి చేసిన వ్యాఖ్యలపై భారత్ దీటుగా బదులిచ్చింది. అది అసంబద్ధ ఆందోళన అని వ్యాఖ్యానించింది. జెనీవాలో జరిగిన మానవ హక్కుల మండలి 55వ సమావేశంలో మానవ హక్కుల విభాగం అధిపతి వోకర్ టర్క్ మాట్లాడుతూ.. మైనార్టీలపై వివక్ష, మానవ హక్కుల పరిరక్షకులు, పాత్రికేయులపై పరిమితులు, విమర్శకుల లక్ష్యంగా దాడి ఘటనలు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై జెనీవాలోని ఐరాస కార్యాలయంలో శాశ్వత రాయబారి అరిందమ్ బాగ్చి స్పందించారు. 'ఈ ఆందోళనలు అసంబద్ధమైనవి. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ వాస్తవికతను ప్రతిబింబించడం లేదు. ప్రజాస్వామ్యంలో వాదనలు సహజమే. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు మా అనుభవాలనుంచి నేర్చుకోవాలని, అనుకరించాలని కోరుకుంటున్నాయి. భారత ప్రజలు తమ ఆకాంక్షలకు అనుగుణంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. గతంలో మాదిరిగానే ఈ ప్రక్రియ జరుగుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు' అని బాగ్చి వెల్లడించారు. ఇదే వేదికపై జమ్మూకశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ లేవనెత్తగా.. భారత్ గట్టిగా కౌంటర్ ఇచ్చింది. దాని భయానక మానవహక్కుల రికార్డును పాక్ ఆత్మపరిశీలన చేసుకోవాలని మండిపడింది. 'గ్లోబల్ టెర్రరిస్ట్ ఫ్యాక్టరీ' అనే పదం ఆ దేశానికి సరిగ్గా సరిపోతుందంటూ దుయ్యబట్టింది. సదరు ప్రతినిధి బృందం తమ దేశంపై చేసే నిరాధార వ్యాఖ్యలకు స్పందించడం ద్వారా మండలి సమయాన్ని వృథా చేయదల్చుకోలేదని పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

# అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే

**కాళేశ్వరమే ఇందుకు ప్రబల ఉదాహరణ**

**వరుసగా రెండోరోజూ కాంగ్రెస్‌పై విమర్శలు**

**సంగారెడ్డి వేదికగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ప్రజలంతా నాకుటుంబ సభ్యులే అన్న ప్రధాని మోడీ**




ఆదిలాబాద్‌లో చేసిన విమర్శలనే సంగారెడ్డిలోనూ చేశారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలను నమ్మకోవద్దని, వాటికి వేర్వేరు ముఖాలు ఉండవచ్చునని, కానీ, ఉమ్మడి లక్షణం మాత్రం దోచుకోవడం.. అబద్దాలు చెప్పడమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించారు. ఇకపోతే ప్రజలతంతా తన కుటుంబం అన్నారు. మోడీ కుటుంబంలో మీరంతా భాగస్వాములని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతరంగా కృషి చేస్తున్నదని ప్రధాని మోదీ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని, నేడు సంగారెడ్డి నుంచి మరో రూ.7 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధి అని నమ్ముతామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటేల్‌గూడలో రూ.9021 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బేగంపేటలో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇది దేశంలోనే మొదటదని వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా హైదరాబాద్, తెలంగాణకు గుర్తింపు వస్తుందని చెప్పారు. ఏవియేషన్ కేంద్రం.. స్టార్టప్‌లు, నైపుణ్య శిక్షణకు వేదికగా నిలుస్తుందన్నారు. గత పదేండ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపయిందని చెప్పారు. పలు కొత్త రైలు మార్గాలు, విద్యుదీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ఘట్‌కేసర్-లింగపల్లి ఎంఎంటీఎస్ రైలు సర్వీసు ఇప్పటికే ప్రారంభమైందని గుర్తుచేశారు. పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు పారాదీప్ నుంచి హైదరాబాద్‌కు పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు వికసిత్ భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నారని ప్రధాని అన్నారు. వికసిత్ భారత్ కోసం మౌలిక సౌకర్యాల కల్పన ఆవశ్యకమని చెప్పారు. మౌలిక సౌకర్యాల కోసం బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడించారు. సంగారెడ్డి నుంచి మదీనగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. దీనిద్వారా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య అనుసంధానత ఏర్పడుతుందన్నారు. దక్షిణ భారత్‌కు గేట్‌వేలా తెలంగాణ నిలుస్తుందని చెప్పారు. పటాన్ చెరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కుటుంబ పార్టీల పాలనపై ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మోదీ మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలను నేను వ్యతిరేకిస్తున్నాను. కుటుంబపార్టీల కారణంగా ప్రతిభ ఉన్నవారికి అన్యాయం జరుగుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. అవినీతిని బయట పెడుతున్నాననే అక్కసుతో కాంగ్రెస్ నాపై విమర్శలు చేస్తోంది. కుటుంబ పాలన సాగించే వారిలో అభద్రత భావం పెరిగిపోయింది. వారసత్వ నేతలకు భయం పట్టుకుంది. కుటుంబ పార్టీల నేతలు సొంత ఖజానాను నింపుకుంటున్నారు. కుటుంబ పాలకుల అవినీతి దళాన్ని వెలికితీస్తున్నాం. ప్రజల నమ్మకాన్ని నేనెప్పుడూ వమ్ము కానివ్వను. ఇక్కడ దోచుకున్న నల్లధనం దాచుకోవడానికి విదేశాల్లో ఖాతాలు తెరిచారని వ్యాఖ్యా నించారు. అయోధలో రామమందిరం నిర్మిస్తామని చెప్పాం. ప్రపంచం గర్వించే రీతిలో అయోధ్యలో శ్రీరాముడి ప్రతిష్టాపన జరిగింది. దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కుటుంబ పార్టీల పాలన కొనసాగుతోంది. కుటుంబ పార్టీల పాలనలో ఉన్న చోట వారి కుటుంబాలే బాగుపడ్డాయి. కుటుంబపార్టీలకు దోచుకోవడానికి ఏమైనా లైసెన్స్ ఉందా? అని ప్రశ్నించారు. పటాన్ చెరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'మీ ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ప్రేమను తెలంగాణ అభివృద్ధి రూపంలో చూపిస్తా. విదేశాల్లో చాలామంది తెలుగువారు ఉన్నారు. విదేశాల్లో మనవాళ్లను చూస్తుంటే గర్వంగా ఉంది. జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న మోడీ

**ప్రధాని రాక సందర్భంగా సికింద్రాబాద్‌లో భారీ భద్రత**

**రెండోరోజు తెలంగాణలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): రెండోరోజు తెలంగాణలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానమంత్రి రానున్న వేళ అధికారులు సికింద్రాబాద్ మొత్తం కట్టిదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయం మొత్తం నిఘా నీడలోకి వెళ్లిపోయింది. పన్నెండు అంచెల భద్రతను ఏర్పాటుచేశారు.



ప్రధానమంత్రి పూజలు చేసే సందర్భంలో ఇద్దరిని మాత్రమే ఆలయంలోకి అనుమతించారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాని మోదీ అమ్మవారికి మోదీ ప్రత్యేక పూజలు చేశారు. రాజ్‌భవన్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్ వెళ్లిన ప్రధాని మోదీ అక్కడ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానితో పాటు ముఖ్యులకు మాత్రమే ఆలయంలోకి అనుమతించారు. ఆలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు ప్రధాని మోదీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం తరువాత హారతి అందజేశారు. శాలువాతో ప్రధానిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి, వేద ఆశీర్వదం అందజేశారు. సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ప్రధాని మోదీ.. సంగారెడ్డి జిల్లాకు బయలుదేరారు. ముందుగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సంగారెడ్డి చేరుకున్నారు. అక్కడ రూ.9 వేల 21 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్‌గా చేసారు. రూ.1409 కోట్ల రూపాయలతో నిర్మించిన ఎన్‌హెచ్-161 నాందేడ్ అఖోలా నేషనల్ హైవేని జాతికి అంకితం చేసారు ప్రధాని మోదీ. ఈ పర్యటన కోసం నిన్న ప్రధాని రాజ్ భవన్ లోనే బస చేశారు. ఆయన కోసం రాజ్ భవన్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

## నేటికీ మంచినీటికి నోచుకోని పదిలక్షల ఆవాసాలు

నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తామని తెలిపారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ అభివృద్ధికి, మూసీ ప్రక్షాళన రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సహకరించండి. తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలి. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022-23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ,3 కోట్లు మంజూరు చేసింది. రూ.7700 కోట్ల అంచనా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి. ఈ కారిడార్ తో అటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దక్షిణ తెలంగాణ వైపు రవాణ మార్గాలు విస్తరిస్తాయని సిఎం తన లేఖలో పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్- రామగుండం, హైదరాబాద్-నాగ్పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. లీజు గడువు ముగిసిన శామీర్ పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ 1038 ఎకరాల భూములను తిరిగి అప్పగించాలన్నారు. ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీ తో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం నెలకొల్పాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. అందులో భాగంగా హైదరాబాద్ లో ఐఐఎం నెలకొల్పాలన్నారు. అందుకు అవసరమైనంత స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. 5259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి. భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కల్వకుర్తి-కొల్లాపూర్, గౌరెల్లి-వలిగొండ, తొర్రూర్-నెహ్రూనగర్, నెహ్రూనగర్-కొత్తగూడెం, జగిత్యాల-కరీంగర్ ఫోర్ లేన్, జడ్చర్ల-మరికల్ ఫోర్ లేన్, మరికల్-డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలన్నారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సెమీ కండక్లర్లు, డిస్ ప్లే మ్యానుఫ్యాక్షరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా కేంద్రం సాయం అందించాలని సిఎం రేవంత్ తన వినతిలో పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

**మావోయిస్ట్ సంబంధాలను తోసిపుచ్చిన హైకోర్టు - నిర్దోషిగా విడుదల చేస్తూ ఆదేశాలు**



ముంబై,మార్చి5 (ప్రజా మంటలు): మావోయిస్టులతో సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు భారీ ఊరట లభించింది. సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఆయనకు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ మంగళవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. దీంతో కొన్నేళ్లుగా జైలులో ఉన్న సాయిబాబా త్వరలో నాగ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల కానున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సాయిబాబాను 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. దేశంపై యుద్ధం చేసే కార్యకలాపాలకు పాల్పడినందుకు దోషులుగా నిర్ధారించింది. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉంటున్నారు. అయితే సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సాయిబాబా, ఇతరులు చేసిన అప్పీల్‌పై బాంబే హైకోర్టు నేడు తీర్పు వెలువ రించింది. నాగ్‌పూర్ సెషన్స్ కోర్టు తీర్పును న్యాయమూర్తులు వినయ్ జోషి, వాల్మీకి ఎస్ఏ మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. నిందితులపై కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయమూర్తులు వినయ్ జోషి, వాల్మీకి ఎస్ఏ మెనెజెస్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. యాభై నాలుగేళ్ల సాయిబాబా వీల్‌చైర్‌కే పరిమితమైన దివ్యాంగుడు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా సాయిబాబా చాలాకాలం పనిచేశారు. మావోయిస్టులతో సంబంధాలున్నట్టు ఆరోపణలపై జైలుపాలు కావడంతో 2021 ఫిబ్రవరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి ఆయనను తొలగించారు. ఈ క్రమంలో ఆయన కోర్టులోనే పోరాడారు. మావోయిస్టు లింక్ కేసులో జీఎన్ సాయిబాబా, హేమ్ మిశ్రా, మహేష్ టిర్కీ, విజయ్ టిర్కీ, నారాయణ్ సాంగ్లికర్, ప్రశాంత్ రాహి, పాండు నరోటే (మరణించారు)లను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది. హైకోర్టు గతంలో నిర్దోషిగా విడుదల చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు కొట్టివేయడంతో సాయిబాబా అప్పీల్‌ను బాంబే హైకోర్టు మళ్లీ విచారించింది. జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మీకి ఎస్ఏతో కూడిన ధర్మాసనం తీర్పును వెల్లడించింది. మావోయిస్టు సంబంధాల కేసులో ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాతో పాటు మరో ఐదుగురు నిందితులను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషులుగా ప్రకటించింది.

## రాష్ట్రాలను లూటీ చేస్తున్న కుటుంబ పార్టీలు

**కుటుంబ పాలనకు నేను పూర్తిగా వ్యతిరేకం**

**దేశ ప్రజలే నా కుటుంబం అన్న ప్రధాని**

**భారత్‌ను మూడో ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతా**

**సంగారెడ్డి సభలో విపక్షాలను ఏకిపారేసిన మోడీ**


సంగారెడ్డి,మార్చి5 (ప్రజా మంటలు): తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమ, ఆదరణను వృథా కానివ్వనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మనమంతా కలిసి దేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు. ప్రపంచంలో తెలుగు వారి ఖ్యాతి వ్యాప్తిచెందిందని.. ఇది దేశానికి గర్వకారణమని చెప్పుకొచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన సభలో.. నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ మోదీ తెలుగులో ప్రసంగం మొదలుపెట్టారు. తెలంగాణను రెండింతలు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ అని స్పష్టం చేశారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేస్తామని చెప్పామని. చేశామా? లేదా? అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ట చేస్తామని చెప్పాం.. చేశామా.. లేదా.. మోదీ ఇచ్చిన గ్యారెంటీ.. నెరవేరిందా? లేదా? అని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న దేశంగా భారత్ ఎదుగుతోందని అన్నారు. ఇప్పుడు మీకు మరో గ్యారెంటీ ఇస్తున్నా. కొన్నేండ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దుతా.. మీకు మాటిస్తున్నా. ఇది మోదీ గ్యారెంటీ.. మోదీ గ్యారెంటీ అంటే గ్యారెంటీగా పూర్తయ్యే గ్యారెంటీ. మోదీని తిట్టడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. అలా ఎందుకు చేస్తున్నారంటే.. వారికి సంబంధించిన వేల కోట్ల అవినీతిని ప్రశ్నించినందుకు తిడు తున్నారు. నేను వ్యక్తిగతంగా ఎవరిపైనా విమర్శలు చేయ లేదు.. కుటుంబ పాలనపై ప్రశ్నించినందుకు నన్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. జమ్ము కశ్మీర్ నుంచి మొదలు తమిళ నాడు వరకు కుటుంబ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయి.. రాష్ట్రం మాత్రం అధోగతి పాలైంది. కుటుంబ పాలనను మేము వ్యతిరేకిస్తున్నాం. అందుకే మాపై వారు విమర్శలు చేస్తున్నారు. నేను కుటుంబ పాలనపై ప్రశ్నిస్తుంటే.. వారు మాత్రం నాకు కుటుంబం లేదని నాపై విమర్శలు చేస్తున్నారు. కుటుంబ పాలన చేసే వారికి దొంగతనం చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? కబ్జా, అవినీతి చేసేందుకు లైసెన్స్ ఇచ్చారా? ఒక్కో కుటుంబంలో 50 మంది వరకు దోచుకుతింటున్నారు.. ఇది ప్రజాస్వామ్యమా.. మోదీపై మా యుద్ధం కొనసాగిస్తామని చెబుతున్నారు. కానీ మోదీకి మాత్రం నేషన్ ఫస్ట్. వారికి వారి కుటుంబమే ముఖ్యం.. కానీ నాకు దేశ ప్రజలంతా ముఖ్యం. కుటుంబ పార్టీలు నల్ల ధనాన్ని తెల్ల ధనంగా మార్చుకున్నాయి. కానీ నేను అలా కాకుండా నాకు వచ్చిన గిఫ్టులను దేశ అభివృద్ధి కోసం వేలం వేస్తున్నా.. గంగా మాత సేవ కోసం ఉపయోగిస్తున్నా. నేను మీ సేవకుడిని. నాకు కూడా కుటుంబం ఉంటే.. నాకు వచ్చిన గిఫ్టులను, వేలం ద్వారా వచ్చిన డబ్బులను నేను పట్టుకెళ్లేవాడినేమో.. కుటుంబ పార్టీలకు చెందిన కొందరు నేతలు విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేశారు. వారు తమ కుటుంబం కోసం కోటలు కట్టించుకున్నారు. కానీ మోదీ ఇప్పటి వరకు తన కోసం ఒక్క ఇల్లును కూడా కట్టించుకోలేదు. కానీ ఇండ్లు లేని పేదల కోసం 4 లక్షల కోట్ల ఇండ్లను నిర్మించాడు. కుటుంబ పార్టీలు భూమి నుంచి ఆకాశం వరకు దేన్నీ వదలకుండా దోచుకున్నారు. కానీ మోదీ మాత్రం భూమి, ఆకాశం మాత్రమే కాకుండా పాతాళం వరకు ప్రతీ ఒక్క అవకాశాన్ని దేశాభివృద్ధి కోసమే చేస్తున్నారు. 140 కోట్ల మంది దేశ ప్రజలు మోదీ కుటుంబ సభ్యులే.. కాంగ్రెస్, ఇండియా కూటమి వాళ్లకు ఇంకా తెలియడం లేదు.. మోడీని దేశమంతా తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు. తెలంగాణ ప్రజలంతా నేనే మోదీ కుటుంబమని చెబుతున్నారని ప్రధాని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బిబి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


## ముగిసిన ప్రధాని మోడీ రెండ్రోజుల పర్యటన

**హైదరాబాద్ నుంచి ఒడిషా కు వెళ్లిన మోడీ**

**బేగంపేటలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, సిఎం రేవంత్**

హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): తెలంగాణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన ముగిసింది. సాయంత్రం సంగారెడ్డి నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు వీడ్కోలు పలికారు. ఆపై బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఒరిస్సాకు ప్రధాని బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించిన మోదీ.. రూ.6 వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. అంబారీ - ఆదిలాబాద్ - పింపాలకుట్టీ రైల్వే విద్యుద్దీకరణను జాతికి అంకితం చేశారు. మంచిర్యాల జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.





అలాగే మంగళవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సంగారెడ్డికి బయలుదేరి వెళ్లిన ప్రధాని పటాన్‌చెరులోని పటేల్ గూడ చేరుకుని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దాదాపు రూ.7వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. అనంతరం సంగారెడ్డి నుంచి బయలుదేరి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఒరిస్సాకు ప్రధాని మోదీ పయనమయ్యారు. కాగా... ప్రధాని మోదీ పర్యటనకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరంగా ఉండగా... ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పాత ఆనవాయితీని కొనసాగించారు. ఆదిలాబాద్ సభలో పాల్గొనడమే గాకుండా ప్రధానిని పెద్దన్నయ్యగా సీఎం సంబోధించారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనంటూ బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ కౌంటర్ అటాక్‌కు దిగింది.

## పాక్, ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ హిమపాతం

ఖైబర్,మార్చి5 (ప్రజా మంటలు): పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ను భారీ హిమపాతం ప్రజలను హడలెత్తించింది. ఇటీవల కురిసిన మంచు.. వడగళ్ల వానతో పెద్ద ఎత్తున ప్రజల ప్రాణాలను కోల్పోయారు. పాకిస్థాన్‌లో ఇప్పటి వరకు 36 మంది మృతిచెందగా.. 43 మంది గాయపడ్డారు. ప్రస్తుతం ఇంకా సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌లో భారీగా హిమపాతం కురిసింది. అదే సమయంలో వడగళ్ల వాన పడింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 36కి చేరింది. మరో 43 మంది గాయపడ్డారని ఆ దేశ మీడియా పేర్కొంది. మృతుల్లో 22 మంది వరకు చిన్నారులున్నారు. చాలామంది మంచుపెళ్లల కింద చిక్కుకుపోయి చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చిలో పాక్ పశ్చిమ, ఉత్తర భాగాల్లో వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. పర్యావరణ మార్పుల్లో భాగంగానే ఇలా జరిగినట్లు వాతావరణ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ ముస్తాక్ అలీషా వెల్లడించారు. గత 25 ఏళ్లలో ఖైబర్ ప్రాంతంలో ఒక్కసారి మాత్రమే హిమపాతం చూశామని స్థానికులు చెబుతున్నారు. తాజాగా వడగళ్ల వాన కారణంగా ఖైబర్, బలోచిస్థాన్ ప్రావిన్సుల్లో 150 ఇళ్లు ధ్వంసం కాగా.. దాదాపు 500 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇక్కడ కొన్ని జిల్లాలకు విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ పూర్తిగా నిలిచిపోయింది. ఇక అఫ్ఘనిస్థాన్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ 39 మంది మరణించగా.. మరో 30 మంది గాయపడినట్లు సమాచారం. దీనిపై అక్కడి విపత్తు ప్రతిస్పందన నిర్వహణశాఖ ప్రతినిధి జనాన్ సయిక్ మాట్లాడుతూ 637 ఇళ్లు కూలిపోగా.. 14,000 పశువులు మరణించాయన్నారు.

## తన వారెవరూ ఎన్నికల్లో పోటీచేయరు

**తమ్ముళ్ల రాజకీయ ప్రవేశ ప్రచారానికి రేవంత్ తెర**

**అభివృద్ది కోసం ఎవరు కలిసినా తప్పలేదు**

**ఎమ్మెల్యేలు కలిస్తే రాజకీయాలు అల్లడం సరికాదు**

**మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్ తమ్ముడు మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుటుంబంలో ఎవరూ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయరని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ వాళ్లెవరూ రాజకీయాల్లోకి రావడం కానీ, పోటీ చేయడం కానీ జరగదన్నారు. ఇదంతా బురదజల్లే ప్రచారంగా కొట్టి పారేశారు. తనను ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కలవడంలో ఎలాంటి రాజకీయం లేదని తెలిపారు. సీఎంను ఎమ్మెల్యేలు కలిస్తే ఏదో జరుగుతున్నట్లుగా మాజీ సీఎం కేసీఆర్ చేశారని మండిపడ్డారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఎందుకు పడిపోతుందో విమర్శించే వారే చెప్పాలని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ ప్రతిపక్షనేత ఎలా అవుతారని నిలదీశారు. దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెద్దన్న అవుతారన్నారు. కేసీఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం చేస్తే..వంద రోజుల్లో తమ ప్రభుత్వం పట్టాలెక్కించే ప్రయత్నం చేస్తుందని అన్నారు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన మిత్రుడేనని.. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే ఏమి కాదన్నారు. తమ ప్రభుత్వ పరిపాలన రిఫరెండంగా పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. 14కు పైగా ఎంపీ సీట్లు గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో పోటీ చేస్తే రాష్ట్ర గౌరవం పెరుగుతుందని చెప్పారు. కాళేశ్వరంపై ఫైనల్‌గా ఎన్డీఎస్ఏ చెప్పిందే రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోజుకు రెండున్నర కోట్ల ఇసుక ఆదాయం పెరిగిందని అన్నారు. జీఎస్టీ రూ.500 కోట్ల ఆదాయం పెరిగిందని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌పై అధికారుల నివేదిక వచ్చాక స్పష్టత ఇస్తామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్‌పై ఇంటర్నల్ ఆడిట్ జరుగుతుందని.. రిపోర్టును బట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్యాక్స్ పేయర్స్‌కు రైతు బంధు ఎందుకు.. వ్యవసాయం చేసే వారికే రైతు బంధు కావాలని అన్నారు. రైతుబంధుపై తెలంగాణ అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అన్ని ప్రైవేటు యూనివర్సిటీలపై విచారణ జరుపుతామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్ రోజంతా ధర్నా చేయాలన్నారు. ప్రణిత్ రావు వ్యవహారంపై సమగ్ర విచారణ జరుగుతుందని తెలిపారు. జీవో 3 పై కోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# గులాబీతోటలో చేరిన ఏనుగు

**కలసి పోటీ చేయాలని బిఆర్ఎస్, బిఎస్పీ నిర్ణయం**

**కెసిఆర్‌తో బిఎస్పీ అధినేత ప్రవీణ్ కుమార్ చర్చలు**

**కలసి ఎన్నికల్లో పోటీకి దిగుతామన్న కెసిఆర్**

**మాయావతితో మాట్లాడుతానన్న వెల్లడి**



హైదరాబాద్, మార్చి 5(ప్రజా మంటలు): తెలంగాణ రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. భారత రాష్ట్ర సమితి.. బహుజన సమాజ్ పార్టీతో పొత్తులు పెట్టుకోవాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ .. కేసీఆర్ తో సమావేశం అయ్యారు. కలసి పని చేయడంపై చర్చించారు. పొత్తులు పెట్టుకోవాలని నిర్ణయంచుకున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాగర్ కర్నూలు నుంచి ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో తెలంగాణలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల మధ్య పొత్తు కుదిరింది. మంగళవారం నాడు రాష్ట్ర బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి చర్చించారు. ఈ భేటీలో భాగంగా పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుపై నిశితంగా చర్చించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఎన్నికల నేపథ్యంలో ఇందుకు సంబంధించి సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్టు ఇరు పార్టీల అధ్యక్షులు ప్రకటించారు. విధి విధానాలు త్వరలో ఖరారు కానున్నాయని ఇరు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో భేటీ ముగిసిన అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. బీఎస్పీతో గౌరవప్రదమైన పొత్తు ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. బీఎస్పీ హైకమాండ్‌తో మాట్లాడి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్, బీఎస్పీ కలిపి పని చేయాలని నిర్ణయించామన్నారు. సీట్ల సర్దుబాటు, పొత్తు విధివిధానాలతో పాటు మిగతా విషయాలన్ని రేపు, ఎల్లుండి ప్రకటిస్తాం అని కెసిఆర్ తెలిపారు. కొన్ని సీట్లలో వారు, మేం కొన్ని సీట్లలో పోటీ చేస్తాం. నాగర్‌కర్నూల్ నుంచి ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తారా..? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. పెద్దపల్లి నుంచి పోటీ చేయొద్దా..? రాష్ట్ర అధ్యక్షుడు కదా.. వరంగల్ నుంచి కూడా పోటీ చేయొచ్చు. జనరల్ సీట్లలో కూడా పోటీ చేయొచ్చు అని కేసీఆర్ తెలిపారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీతో కలిసి పని చేయాలని నిర్ణయించు కున్నామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో భేటీ తర్వాత కేసీఆర్ ప్రకటించారు. బుధవారం బీఎస్పీ చీఫ్ మాయావతితో మాట్లాడతానని తెలిపారు. పొత్తు విధి విధానాలను త్వరలోనే ఖరారు చేస్తామని బీఎస్పీకి కొన్ని సీట్లను కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ముప్పు ఏర్పడిందని.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రాజ్యాంగానికి ఈ రెండు పార్టీలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. వీటి నుంచి తెలంగాణ ను కాపాడుకోవడానికే పొత్తులు పెట్టుకున్నామని.. అన్ని విషయాలు త్వరలోనే తెలియ చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండింటినీ దేశంలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందని.. మా స్నేహం తెలంగాణను పూర్తిగా మారుస్తుందని ప్రవీణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు నెలలు కాకముందే కాంగ్రెస్ పై వ్యతిరేకత వచ్చిందన్నారు. ఐపీఎస్ ఉద్యోగానికి వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి రాజకీయాల్లోకి వచ్చిన ప్రవీణ్ కుమార్ బీఎస్పీ చీఫ్ గా బాధ్యతలు తీసుకుని విస్తృతంగా పర్యటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వీలైనంత వరకూ గట్టి అభ్యర్థులనే నిలబెట్టారు. తను జనరల్ నియోజకవర్గం అయిన సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఒక్క ఎమ్మెల్యే కూడా బీఎస్పీ తరపు నుంచి నెగ్గలేదు. దీంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ భవిష్యత్ పై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ పొత్తు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. రెండు పార్టీలకు ఉభయతారకంగా ఉంటుందన్న అభిప్రాయంతో ముందడుగు వేసినట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ పొత్తులకు వ్యతిరేకం. గతంలో కమ్యూనిస్టులతో పొత్తులు పెట్టుకుంటామని మాట ఇచ్చినా చివరికి హ్యాండిచ్చారు. ఒక్క మజ్లిస్ పార్టీతో మాత్రమే.. తెర వెనుక సహకారం ఉండేది. ఇప్పుడు మజ్లిస్ కూడా దూరమయింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి వలసలు పెరిగాయి. సిట్టింగ్ ఎంపీలు పార్టీ మారుతున్నారు. బీఎస్పీతో పొత్తులు పెట్టుకోవడం మంచిదన్న అభిప్రాయానికి కేసీఆర్ వచ్చారు. ఎన్ని స్థానాలు కేటాయిస్తారన్నది రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## మోత్య తండాలో విషాదం

### విద్యుత్ షాక్‌తో నలుగురు మృత్యువాత

వరంగల్,మార్చి5 (ప్రజా మంటలు): పర్వతగిరి మండలం మోత్య తండాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్ గురైన నలుగురు వ్యక్తులు చనిపోయారు. భూక్య దేవేందర్ అనే వ్యక్తి ఘటనా స్థలిలోనే చనిపోగా... మరో ముగ్గురు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. విద్యుత్ షాక్ తర్వాత ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ వారు ప్రాణాలు వదిలేశారు. విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారు గట్టికల్లు జగన్నాథ, పెళ్లి దేవేందర్, తొర్రూరు మండలం జమస్తన్ పురం తండాకు చెందిన అనిల్ గా గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడిన భూక్య చిన్ను అనే నాలుగేళ్ల బాలుడు వరంగల్ ఎంజీఎం లో చికిత్స పొందుతున్నారు. ఆ బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. దుర్గమ్మ పండుగ కోసం డెకరేషన్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అగ్నిప్రమాదంలో రైల్వేబోగీ దగ్ధం

ఖాజీపేట,మార్చి5 (ప్రజా మంటలు): కాజీపేట రైల్వే స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్టేషన్‌లోని ప్లాట్ ఫాంలకు దూరంగా ఉన్న పార్కింగ్ ట్రాక్‌లపై ఈ అగ్ని ప్రమాదం జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలులోని బొగ్గుకు నిప్పంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డట్లు తెలిపారు. క్షణాల వ్యవధిలోనే మంటలు చెలరేగి పక్కనే నిలిపి ఉంచిన ప్యాసింజర్ రైలుకు అంటుకున్నాయని.. దీంతో పలు బోగీలు మంటల్లో కాలిపోయాయని తెలిపారు. ఈ ప్రమాదంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బెంగుళూరు పేలుడు కేసు

### దేశవ్యాప్తంగా ఎన్ఐఎ సోదాలు

చెన్నై,మార్చి5 (ప్రజా మంటలు): బెంగళూరు కేఫ్ పేలుళ్ల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం తమిళనాడు, కర్ణాటక సహా దేశంలోని అనేక ఇతర ప్రాంతాల్లో ఉదయం నుంచి సోదాలు చేపట్టింది. లష్కరే తోయిబా దక్షిణ భారత కమాండర్ తడియంతవిడ నసీర్ బెంగళూరు సెంట్రల్ జైలులో కొంతమంది యువకులకు శిక్షణ ఇచ్చాడని, వారిలో చాలా మంది ప్రస్తుతం జైలు నుంచి బయటపడ్డారనే సమాచారం మేరకు ఎన్ఐఏ విచారణ జరుపుతోంది. రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ ఈ యువకులపై దృష్టి సారించిందని, వారిలో కొందరికి తమిళనాడులోని కడలూరు, చెన్నైలతో సంబంధాలున్నాయని ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. దీంతో అనుమానాస్పద వ్యక్తు ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. పలు కేసుల్లో నిందితులకు నిషేధిత సంస్థలతో ఉన్న లింకులపై ఆరా తీస్తున్నారు.

## పెద్దన్న అని ఎందుకన్నారో ఆయన్నే అడగండి

### సిఎం రేవంత్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 5(ప్రజా మంటలు): ప్రధాని నరేంద్ర మోదీని.. సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్న అని ఎందుకన్నారో.. వెళ్లి ఆయన్నే అడగండి అంటూ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీని.. సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్న అన్నంత మాత్రాన కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి అయినట్లా? అంటూ ప్రశ్నించారు. పెద్దన్న అని రేవంత్ రెడ్డి అనడంపై విపక్షాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని... అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశమని చెప్పారు. తెలంగాణలో ప్రధాని మోదీ సభలు సూపర్ సక్సెస్ అయ్యాయని కిషన్ రెడ్డి చెప్పారు. మ్యానిఫెస్టో కోసం రేపటి నుంచి సలహాలు స్వీకరిస్తామన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర ఎలాంటి క్లారిటీ లేదని తెలిపారు. ఆ గ్యారెంటీలు కేవలం పేపర్‌కే పరిమితమయ్యాయని చెప్పారు. వెంటనే ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2లక్షల రుణమాఫీ, 4వేల పెన్షన్‌పై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రజలతో కలసి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే కార్యక్రమాన్ని మెదలుపెట్టనున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై కెసిఆర్‌ను బద్నాం చేసే కుట్ర

బాధపడవద్దని.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ విలువ ప్రజలందరికీ తెలిసిందని చెప్పారు. కాళేశ్వరం దండగా అంటూ కాంగ్రెస్ నాయకులు పబ్బం గడుపుకునే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంలో రెండు పిల్లర్లు కుంగి పోతే రిపేర్ చేయకుండా కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమపై కోపంతో నేతన్నలకు బతుకమ్మ చీరెలు ఆర్డర్ ఇవ్వడం లేదని అన్నారు. రైతులకు నీళు ఇవ్వకుండా కేసీఆర్ మీద బురద జల్లాలని చూస్తున్నారని విరుచుకుపడ్డారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కరీంగనర్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. మతం పేరుతో ఓట్లు అడగడం తప్ప కరీంనగర్‌కు ఆయన ఏం చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలుపెడితే సిరిసిల్లలో ఉన్న మహేందర్ రెడ్డి వరకు అందరూ దగుల్బాజీలు, సన్నాసులు, చేతకాని వెధవలు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంటరీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో మంజూరైన రూ. 14 కోట్ల రోడ్డు రద్దు చేయడం కాదు.. నీకు దమ్ముంటే, చేతనైతే ప్రజల మనసు గెలుచుకోవాలి. దుబ్బాక నుంచి ముస్తాబాద్ వరకు తాను రెండు లేన్ల రోడ్డు మంజూరు చేశాను. నీకు చేతనైతే ఆ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చి ప్రజల మనసును గెలుచుకోవాలి. తన మీద కోపంతో సిరిసిల్ల నేతన్నల కొంప పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు రద్దు చేశారు. కేసీఆర్ మీద కోపంతో చిల్లర రాజకీయం కోసం కాళేశ్వరం వేస్ట్ అంటున్నారు. రైతులకు నీళ్లు ఇవ్వొద్దు.. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతో దివాళా, దగుల్బాజీ రాజకీయం చేస్తోంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. కేసులకు, జైళ్లకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తించాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని పనులను రద్దు చేస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు, నేతన్నలను ఆదుకున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయలేదు.. రైతుబంధు వేయలేదు. ఎల్ఆర్ఎస్‌పై రేపు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేయాలి. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలపై కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది. డిసెంబర్ 9న అన్ని హామీలు నెరవేరుస్తామని రేవంత్ మాట తప్పారు. బీఆర్ఎస్ కేవలం 4 లక్షల ఓట్ల తేడాతోనే ఓడిపోయింది. కరీంనగర్‌కు బండి సంజయ్ చేసిందేమీ లేదు. మతం పేరుతో ఓట్లు అడగడం తప్ప సంజయ్ చేసిందేమీ లేదు. అయోధ్య పేరు మీద ఓట్లు దండుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ నెల 12వ తేదీన కరీంనగర్‌లో కదన భేరి బహిరంగ సభ నిర్వహిస్తాం అని కేటీఆర్ తెలిపారు.

## మేమంతా మోడీ కుటుంబమే

### లాలా వ్యాఖ్యలపై స్మృతి ఇరానీ విమర్శలు



నాగ్‌పూర్,మార్చి5 (ప్రజా మంటలు): ప్రధాని మోదీకి కుటుంబం లేదని, పిల్లలు లేరని ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు వరసగా లాలు ప్రసాద్ యాదవ్‌కు కౌంటర్ ఇస్తున్నారు. మేమంతా ప్రధాని మోదీ కుటుంబ సభ్యుల అని చెబుతున్నారు. సోషల్ మీడియా ఎక్స్ బయోలో పేరు తర్వాత బ్రాకెట్‌లో 'మోదీ కా పరివార్' అని రాస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాశారు. ఆ జాబితాలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేరారు. నాగ్‌పూర్‌లో జరిగిన బీజేపీ నమో యువ మహా సమ్మేళనలో స్మృతి ఇరానీ పాల్గొన్నారు. 'మేమంతా ప్రధాని మోదీకుటుంబ సభ్యులం. ఆయనకు అండగా ఉంటాం. ఇచ్చిన హామీలను మోదీ నెరవేర్చారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేశాం. మీ లాగా కుంభకోణాలు చేయలేదు. దాణా కుంభకోణం చేసిన దొంగ లాలు ప్రసాద్ యాదవ్ అని' స్మృతి ఇరానీ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై స్మృతి ఇరానీ మండిపడ్డారు. గత పదేళ్ల యూపీఏ పాలన – పదేళ్ల మోదీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూడాలని రాహుల్ గాంధీని కోరారు. పదేళ్లలో నిరుపేదలు, మహిళలు, రైతుల జీవితాల్లో సమూల మార్పులు జరిగాయని వివరించారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్మృతి ఇరానీ స్పష్టం చేశారు.

## డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా

### సొంతపార్టీ డైరెక్టర్ల అవిశ్వాసంతో ఖంగుతిన్న నేత



నిజామాబాద్,మార్చి5(ప్రజా మంటలు): జిల్లా డీసీసీబీ ఛైర్మన్ పదవికి పోచారం భాస్కర్ రెడ్డి రాజీనామా చేశారు. సొంత పార్టీ డైరెక్టర్లే అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వటంతో భాస్కర్ రెడ్డి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. డీసీసీబీకి చెందిన మొత్తం 20 మంది డైరెక్టర్లలో 15 మంది అవిశ్వాస నోటీసులు ఇవ్వడంతో.. బీఆర్ఎస్ లో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. భాస్కర్ రెడ్డి రాజీనామాను ఆమోదిస్తారా.. అవిశ్వాస పరీక్ష పెడతారా?.. అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, తమను లెక్కచేయకుండా.. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతోనే పోచారం భాస్కర్ రెడ్డి తీరుపై డైరెక్టర్లు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయనపై అవిశ్వాసం తీర్మానానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్ కు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో.. బీఆర్ఎస్ తరుపు నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు భాస్కర్ రెడ్డి ప్రయత్నిస్తున్న క్రమంలో.. ఆయనపై సొంత పార్టీ డైరెక్టర్ల నుంచి వ్యతిరేకత రావడంతో భాస్కర్ రెడ్డికి షాక్ తగిలింది. మాజీ స్పీకర్ పోచారం తనయుడే భాస్కర్ రెడ్డి కావడంతో జిల్లా రాజకీయాల్లో ఉత్కంటకు తెరలేచింది.

## నేడు మేడిగడ్డ సందర్శనకు ఎన్డీఎస్ఏ

హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం మేడిగడ్డ బ్యారేజీ సందర్శన కోసం నేడు రాష్ట్రానికి రానుంది. కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృతంలో మొత్తం ఆరుగురు సభ్యుల బృందం న్యూఢిల్లీ నుంచి రేపు ఉదయం పదిగంటల 20 నిమిషాలకు బయలు దేరి మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకుంటుంది. సాగునీటి శాఖ కార్యదర్శితో బృందం సమావేశమౌతుంది. గురు, శుక్రవారాల్లో కుంగిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం సుందిళ్ల బ్యారేజీలను బృందం పరిశీలిస్తుంది. ఈ నెల 9న హైదరాబాద్?లో మరోసారి అధికారులతో సమావేశమై రాత్రికి డిల్లీకి బయలు దేరి వెళ్తుంది. నిపుణుల బృందం పర్యటనకు ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఈ బృందం కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీపై ప్రధానంగా దృష్టి సారించనుంది. కుంగుబాటుకు దారితీసిన లోపాలతో పాటు ఎలాంటి మరమ్మతులు అవసరమో సిఫార్సు చేయనుంది. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏ పనులు చేపట్టాలన్నా నిపుణుల కమిటీ సిఫార్సులు తప్పనిసరి. ఇందుకోసం కమిటీకి విధించిన గడువు నాలుగు నెలలు కాగా సాధ్యమైనంత త్వరగానే నివేదిక ఇవ్వాల్సిందిగా కోరతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. వర్షాకాలంలో గోదావరికి వరద ప్రారంభమైయ్యే పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను నిపుణుల కమిటీ నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందచేస్తుంది. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి, అధ్యయనం చేయడంతో పాటు పగుళ్లకు కారణాలు విశ్లేషించి, తగిన సిఫార్సులు చేసేందుకు జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ కమిటీని ఏర్పాటు చేసింది. మూడు ఆనకట్టలకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణంపై సమగ్ర అధ్యయనం, తనిఖీల కోసం రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కమిటీని ఏర్పాటు చేసింది.

## నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన



హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. హాస్టల్‌లో నాసిరకం భోజనం పెడుతుంటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హాస్టల్ ముందు బైఠాయించారు. హాస్టల్ మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల నిరసనతో బషీర్‌బాగ్‌లో రోడ్డుపై ట్రాఫిక్ జామైంది. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థులతో మాట్లాడి ట్రాఫిక్ క్లియర్ చేసే ప్రయత్నం చేశారు.

## నిరుద్యోగులను నిండా ముంచిన బిఆర్ఎస్

**నిరుద్యోగులకు అన్యాయంపై చర్చకు సిద్ధమా**

**ఎమ్మెల్సీ కవితకు బల్మూరి వెంకట్ సవాల్**



హైదరాబాద్, మార్చి 5(ప్రజా మంటలు): గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తామని అని చెప్పి నిరుద్యోగుల పొట్టకొట్టిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా ఉసురు పోసుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఎవరు అన్యాయం చేశారో చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ధర్నా చౌక్ లేదా ఓయూలో ఎమ్మెల్సీ కవిత చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంగళవారం నాడు అసెంబ్లీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాలు భర్తీ పక్రియను చేపట్టారని చెప్పారు. గత ప్రభుత్వంలో మహిళలకు జరిగిన అన్యాయాలను ఎమ్మెల్సీ కవిత ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మహిళలను, నిరుద్యోగులను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జీవో3 పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో నిరుద్యోగులకు న్యాయం చేస్తున్నారని అన్నారు. మెగా డీఎస్సీ, గ్రూప్1 ఉద్యోగాల నోటిఫికేషన్ వేశామని తెలిపారు. దీంతో వారికి దిక్కుదోచడం లేదన్నారు. ఇప్పటికే 30వేల ఉద్యోగాలను తమ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. తెలంగాణ హైకోర్టు డైరెక్షన్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫాలో కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు ఆర్డర్లను పరిగణనలోకి తీసుకుని తాము నియామకాలు చేపడతామని చెప్పారు. ప్రతీ ఏడాది జాబ్ కాల్యెండర్ ప్రకారం ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే మహిళలకు పెద్దపీత వేస్తుందని చెప్పారు. మహిళల కోసం ఏ ఒక్క రోజు కూడా కవిత మాట్లాడలేదన్నారు. 9 ఏళ్ల నుంచి నిరుద్యోగుల కోసం తాను పోరాడానని.. వాళ్ల సమస్యలు తనకు తెలుసునని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ధర్నా చౌక్‌ను బీఆర్ఎస్ ఎత్తి వేసిందని.. తాము పునరుద్ధరించామని అన్నారు. నిరుద్యోగులను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదని బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

## షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించండి


### బెంగాల్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, మార్చి 5 (ప్రజా మంటలు): బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో దోపిడీ, భూకబ్జా, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ నాయకుడు షేక్ షాజహాన్ కస్టడీని కలకత్తా హైకోర్టు మంగళవారం సీబీఐకి అప్పగించింది. షాజహాన్, సంబంధిత కేసు సామాగ్రిని సీబీఐకు అప్పగించడానికి బెంగాల్ పోలీసులకు సాయంత్రం 4.30 గంటల వరకు సమయం కేటాయించింది. బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ ఉత్తర్వును సవాలు చేయడానికి పావులు కదిపింది. అయితే తక్షణ విచారణ కోసం దాని అప్పీల్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. నిబంధనల ప్రకారం నడుచుకుంటామని పేర్కొన్న అత్యున్నత న్యాయస్థానం, రిజిస్ట్రార్ జనరల్ ముందు ఈ పిటిషన్‌ను ప్రస్తావించాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని కోరింది. సీబీఐ, రాష్ట్ర పోలీసు అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం పక్కనపెట్టి, కేసును కేంద్ర ఏజెన్సీకి బదిలీ చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, రాష్ట్ర ప్రభుత్వం రెండూ వేర్వేరు సవాళ్లను దాఖలు చేశాయి. సీబీఐకి మాత్రమే అప్పగించాలని ఈడీ కోరగా.. పోలీసులు దర్యాప్తును నిర్వహించాలని రాష్ట్రం కోరింది. షేక్ షాజహాన్ జనవరి 5 నుంచి పరారీలో ఉన్నాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల బృందం దాడులు నిర్వహించడానికి దారిలో ఉండగా అతని మద్దతుదారుల గుంపు ఈడీ అధికారులపై దాడి చేసింది. ఈడీ అధికారులపై దాడి, షాజహాన్ అదృశ్యం భారీ రాజకీయ రగడకు దారితీసింది. అధికార తృణముల్‌ను బీజేపీ లక్ష్యంగా చేసుకుంది, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ తనను కాపాడుతోందని ఆరోపించింది. 55 రోజులపాటు పరారీలో ఉన్న షాజహాన్‌ను ఎట్టకేలకు ప్రత్యేక పోలీసు బృందం అరెస్టు చేసింది. దీంతో ఆరేళ్లపాటు తృణముల్ షాజహాన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. షాజహాను అరెస్టు చేయాలని బెంగాల్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన మూడు రోజుల అనంతరం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. తృణమూల్ మాజీ నాయకుడు, మమతా బెనర్జీ సన్నిహితుడు బీజేపీ నాయకుడు సువేందు అధికారి "ఇది అరెస్టు కాదుబీ ఇది పరస్పర సర్దుబాటు" అని ప్రకటించారు. గత వారం బెంగాల్‌లో ఉన్నప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన పదునైన దాడికి షాజహాన్–సందేశ్‌ఖాలీ వివాదం కేంద్రీకృతమై ఉంది. తృణమూల్ తన మాజీ సభ్యుడిని కాపాడుతోందని మోదీ ఆరోపించారు. మహిళల బాధలపై "కొంతమంది వ్యక్తులకు" విలువ ఇస్తున్నందుకు బెంగాల్ సీఎంను నిందించారు.

## హైకోర్టులో శ్రీనివాసగౌడ్‌కు చుక్కెదురు

### సెక్యూరిటీ పెంచాలన్న వినతికి తిరస్కరణ



హైదరాబాద్, మార్చి 5 (ప్రజా మంటలు): మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తనకు 4 ప్లస్ 4 గన్ మెన్‌లను కేటాయించాలంటూ శ్రీనివాస్ గౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తనకు ప్రాణ హాని ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. శ్రీనివాస్ గౌడ్ వేసిన పిటిషన్ మంగళవారం విచారణకు రాగా... మాజీ మంత్రి అభ్యర్థనను ధర్మాసనం నిరాకరించింది. ప్రతి ఒక్కరికి ఈ విధంగా కేటాయించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. శ్రీనివాస్ గౌడ్‌కు గన్‌మెన్‌లు అవసరమో లేదో తెలపాలని డీజీపీకి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీని హైకోర్టు ఆదేశిస్తూ... తదుపరి విచారణను మార్చ్ 19కి వాయిదా వేసింది.

# విమర్శలకూ ఓ హద్దుండాలి !

దొంగే దొంగా..దొంగా అన్నట్లుగా ఇప్పుడు బిఆర్ఎస్ తెలంగాణలో విమర్శలు చేయడంలో ముందు వరసలో నిలిచింది. పథకం ఏదైనా దానిపై విమర్శలు చేయడం మొదలు పెట్టింది. తెలంగాణను దోచుకున్న ఓ కుటుంబ సభ్యులు ఇప్పుడు అధికారం దక్కక పోవడంతో వచ్చిన ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత వచ్చిందని నంగనాచి కబుర్లు చెబుతున్నారు. పదేళ్లపాటు ప్రజలపై స్వారీ చేసి, వారిని అణచివేసి, తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కి, పెద్దమనుషులుగా చెలామణి అయిన వారే ఇప్పుడు... అధికారలేమితో ఆయాసపడుతున్నారు. కాళేశ్వరంపై కేంద్రం ఓ కమిటీని అధ్యయనం కోసం ఏర్పాటు చేసింది. ప్రాజెక్ట్ సమర్థతపై అధ్యయనం చేయనుంది. ఇదంతా కూడా రాష్ట్ర అభ్యర్థన మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే కాళేశ్వరంపై హైకోర్టులో జ్యుడిషియల్ విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. ఇవన్నీ తెలిసి కూడా బిఆర్ఎస్ యాగీ చేస్తోంది. కానీ ప్రధాని మోడీ కూడా పరిస్థితి, నిజాలు తెలిసికూడా విమర్శలు చేయడం ఆయన పదవికి హుందాగా లేదనే చెప్పాలి. 'కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తోందని అంటూ ఆదిలాబాద్ వేదికగా చేసిన విమర్శలు ప్రధాని మోడీ అవగాహనా రాహిత్యాన్ని బయటపెట్టాయి. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోందని చెప్పడం ద్వారా పచ్చి అబద్దాలు వల్లించారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కు అవుతోందని,కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మీరు తిన్నారంటే మీరు తిన్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించు కుంటున్నారని చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాక మరోటి కాదు. ఎందుకంటే కాళేశ్వరంలో జరిగిన అవినీతే కాదు...అక్రమ, నాసిరకం కట్టడం పై కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే చర్యలకు పూనుకుంది.కానీ కేంద్రం ఈ విషయంలో కెసిఆర్‌ను వెనకేసుకుంటూ వచ్చింది. అవినీతి కేసుల్లో రక్షణ ఇచ్చింది. ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్‌లను అవినీతి కేసుల్లో రక్షిస్తూ మోడీ మాట్లాడడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. నిజానికి బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇది పదేపదే మోడీ ప్రస్తావించారు. మరి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయంటే శూన్యం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించడం ద్వారా తన హోదాను తక్కువ చేసుకున్నారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేసిన ప్రధాని తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పివుంటే బాగుండేది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించే ముందు నిజాలు తెలుసుకుంటే మంచిది. రాజకీయ విమర్శలు చేసేముందు తమ హోదాను గుర్తు పెట్టుకుంటే మంచిది. నిజానికి నీళ్లు నిధులు, నియామకాల నినాదంతో ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పాటయింది. దాదాపు దశాబ్దంపాటు ఏలిన కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను నిలువునా మోసం చేసింది. ప్రాజెక్టుల పేరుతో అప్పనంగా దోచేసుకున్నారు. ఉమ్మడి ఏపిలో అదే నినాదాన్ని ఎన్నికల ఆయుధంగా మలుచుకొని మరికొన్ని ఆకర్షణీయమైన హామీలతో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. తెలంగాణ సమాజం నూతనంగా ఏర్పడ్డ రాష్ట్రం నుండి, మరీ ముఖ్యంగా ఉద్యమాల నుంచి ఉద్భవించిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అద్భుతంగా పునర్నిర్మిస్తుందని అందరూ ఆశించారు. కానీ అప్పులు చేసి ప్రజలను వంచించారని తేలింది. అభివృద్ధి కోసమే అప్పులు చేశామని నమ్మబలికారు. కేవలం ఓ కుటుంబం కోసం తెలంగాణను తెచ్చుకున్నట్లు అయ్యింది. పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వ పాలన తర్వాత నేడు వెనక్కి చూస్తే ఎంతగా మోసపో యామో తెలుసుకుని ఆశ్చర్యపడాల్సి వస్తోంది. కాళేశ్వరం పేరుతో ఎంత దగా చేశారో కళ్లకు కడుతోంది. ఈ అవినీతిని గత పదేళ్లలో పదేపదే వల్లించిన మోడీ ఏనాడూ కెసిఆర్‌పై లేశమాత్రం చర్యకు కూడా దిగలేదు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి అన్ని వ్యవస్థలను విధ్వంసంచేసి తెలంగాణను తిరోగమనం లోకి తీసుకెళ్ళిందని విమర్శలు చేసిన బిజెపి పెద్దలు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలి. ఇవేవీ చేయకుండా ఇప్పుడే అధికారం చేపట్టి, అవినీతి బూజు దులుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్‌తో పోల్చడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన పలు సాగునీటి ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నా...వాటిని పూర్తిచేసే బాధ్యతను పక్కనపెట్టి, రీడిజైనింగ్ పేరుతో నిర్మాణ వ్యయాన్ని పెంచి, కాళేశ్వరం లాంటి తెల్లల్ల ఏనుగులను సృష్టించిన అపర విశ్వామిత్రుడు మన కెసిఆర్. ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టును పక్కన పెట్టి కాళేశ్వరంతో దాదాపు లక్ష కోట్లు బూడిదలో పోశారు. అందిన కాడికి దోచుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కావలసిన అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి పొంది సుమారు రూ.38 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేసేందుకు పూనుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా మార్చి, పూర్తిస్థాయిలో రీడిజైనింగ్ కార్యక్రమం మొదలు పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం తానే నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, మేడిగడ్డ ప్రాంతంలో బ్యారేజ్ కట్టాలని నిర్ణయించి ముందుకు వెళ్ళడం, ఇప్పుడది ఏ రూపంలో ఉందో ప్రపంచానికి తెలిసి వచ్చింది. దీనిపై కేంద్రం ఏనాడైనా చర్య తీసుకుందా అంటే లేదు. ఎందుకంటే లోపాయకారి అవగాహన అని చెప్పక తప్పదు. మరి అలాంటి వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వబోతున్నారు. బిఆర్ఎస్‌తో లోపాయకారి ఒప్పందం కారణంగానే లిక్కర్ కేసులో కవితను దాచిపెట్టారని ప్రజలు గుర్తించలేదని అనుకుంటున్నారా..?కాగ్ నివేదిక ప్రకారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలంటే మరొక 50,000 కోట్లు అవసరం ఉంటుందని స్పష్టమవుతుంది. అంతేకాకుండా ఇప్పటికే ఖర్చు చేసిన లక్ష కోట్ల పెట్టుబడికి ఎలాంటి ఫలితం రాలేదని అర్థమవుతుంది. వీటితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అశాస్త్రీయమైనదని ఆర్థికంగా లాభసాటి కాదని స్పష్టంగా కాగ్ నివేదికలో పేర్కొనబడింది. కాగ్ నివేదిక అంతా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనిదే కదా..దీనిపై ప్రధాని మోడీ ఎందుకు అధ్యయనం చేయలేదో చెప్పాలి. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని తెలిసినా మిన్నకున్న కేంద్రం ఇప్పుడు కొత్తగా వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా అభాసుపాలయ్యిందే తప్ప మరోటి లేదు. రాజకీయాల్లో హుందాతనం అలవర్చుకుంటే మంచిదని మోడీ లాంటి వారు గుర్తించాలి.

## కాంగ్రెస్‌కు తలనొప్పిగా సర్దుబాటు

# ఒక్కసీటు కోసం పట్టుదలతో సిపిఐ

**హైదరాబాద్, మార్చి 5 (ప్రజామంటలు):** తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. బిజెపి 9 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ కేవలం అధికారికంగా ఒక్కసీటులో అభ్యర్థి పేరును తెలిపింది. బిఆర్ఎస్ 4 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ క్రమంలో ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. కాంగ్రెస్‌లో ఆశావహులు పెరిగారు. నాగర్ కర్నూలు నుంచి మల్లురవి తాను పోటీ చేయడం ఖాయమని అంటున్నారు. ఖమ్మం సీటు కోసం పలువురు పోటీపడుతున్నారు. సిపిఐకి ఇప్పుడు సీటు కేటాయించడం కాంగ్రెస్‌కు తలనొపపిగా మారింది. కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న సీపీఐ.. ఖమ్మంఎంపీ సీట్‌పై ఆశలు పెట్టుకుంది. పొత్తులో భాగంగా ఎంపీ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ని సీపీఐ కోరుతుంది. ఈమేరకు తెలంగాణలో 5 ఎంపీ స్థానాలు ప్రతిపాదించింది సీపీఐ. ఖమ్మం, నల్గొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి ఎంపీ సీట్లలో ఏదో ఒక సీటు కేటాయించాలని కాంగ్రెస్‌కి తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ప్రతిపాధించిన 5 ఎంపీ స్థానాల్లో ఒక్కటైన ఇస్తుందని ఆశీస్తున్నట్లు కూనంనేని చెప్పారు. ఖమ్మంలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. రాష్ట్రంలోని మిగిలిన స్థానాలతో పోలిస్తే ఈ ఐదు ఎంపీ సీట్ల పరిధిలో బలంగా ఉన్నామని సీపీఐ చెప్తోంది. కాంగ్రెస్ సహకరించి ఒక సీటు కేటాయిస్తే.. గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తు పెట్టుకుని ఒక సీటు కేటాయించినట్టే.. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లోనూ ఒక సీటు కేటాయించాలని కోరుతోంది. ఒక్క సీటైనా ఇచ్చేలా ఒప్పిస్తామని చెప్తున్నారు కూనంనేని. కమ్యూనిస్టులు ఉంటేనే ఇండియా కూటమికి బలం అని తమకు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానామైన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండియా కూటమిలో భాగంగా తమిళనాడులో సీపీఐకి డీఎంకే రెండు సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ మనుగడ రోజురోజుకి తగ్గిపోతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్లేస్‌ను బీజేపీ భర్తీ చేసేందుకు చేస్తున్న ప్లాన్స్‌ని కాంగ్రెస్ తిప్పికొట్టాలని చెప్పారు. సీపీఐ పొత్తుతో కాంగ్రెస్‌కి మరింత బలం చేకూరుతుందని కూనంనేని సాంబశివరావు చెప్పారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఇప్పుడు ఆశావహులు పెరిగారు. 17 సీట్లలో కూడా అంతా పోటీలో ఉన్నారు. ఒక్కో సీటులో కనీసం పదిమంది రంగంలో ఉన్నారు. ఈక్రమంలో సిపిఐని సర్దుబాటు చేయడం కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు.




# తెలంగాణలో బయుట పడుతున్న నీటికష్టాలు

### ఇంతకాలం దాచినా ఇప్పుడు దాగని అవస్థలు

### సాగునీటి కోసం అన్నదాతల ఆందోళన

**సిద్దిపేట, మార్చి 5 (ప్రజామంటలు):** వేసవి కాలం మొదలు అయ్యిందో లేదో.. అప్పుడే నీటికటకటలు మొదలయ్యాయి. ఇంతకాలం సమస్యలను బయటకు రాకుండా దాచారు. మిషన్ కాకతీయతో చెరువులు ఉబికి వస్తున్నాయని బుకాయించారు. ఎండాకాలం లోనూ మత్తళ్లు దుముకుతున్నాయని ప్రచారం చేసుకున్నారు. మరి ఈ మూడు నెల్లలోనే పాతాల గంగ అదృశ్యమయ్యిందా అన్న రీతిలో నీటి సమస్యలు తన్నుకు వస్తున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలకు అవస్థలు మొదలయ్యాయి. వ్యవసాయానికి అవసరమయ్యే సాగు నీటికి ఇప్పటినుండే ఇబ్బందులకు గురవు తున్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా తమను మాత్రం గుర్తించడం లేదని తమ సమస్యలను తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పంటలు పంచడించలేమని అన్నదాత అందోళన చెందుతున్నరు. ఉమ్మడి మెదక్ జిల్లా అంటేనే వ్యవసాయ అధారిత జిల్లా ఎక్కడ పండించే పంటలు దేశం మొత్తం ఎగుమతి చేస్తారు. దేశానికే ధాన్య బండగరంలా ఉన్న జిల్లా



ప్రస్తుతం నీటి వనరులు లేక వ్యవసాయ సాగుకు అంతరాయం ఏర్పడింది. గత ప్రభుత్వం లక్ష ఎకరాలకు నీటిని అందించే ఉద్దేశ్యంతో ప్రాజెక్టు నిర్మించినా అవి చివరి దశకు చేరకపోవడంతో తిరిగి సాగునీటిని ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొంది. కనీసం ఈ ప్రభుత్వం అయినా ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతున్నారు. గగతంలో తాము ఆందోళన చేసినా పట్టించు కోలేదని, సరికాదా అణచి వేసారని ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో సాగునీటి కోసం రైతన్నలు రోడ్డు ఎక్కారు. దుబ్బాక మండలం మల్లాయి పల్లి రైతులు పొలాల వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నుండి వచ్చే కెనాల్ 50 మీటర్లు పూర్తి చేసి ఉంటే వందల ఎకరాల వరి పంట సాగు అయ్యేదని పూర్తిగా పంటలు ఎండిపోయాయని నిరసన చేస్తూన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పంట పొలాల వద్ద రైతుల ఆందోళన బాటపట్టారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి రైతులు వ్యవసాయానికి సాగునీరు ఇవ్వాలంటూ ధర్నా చేస్తున్నారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను అసంపూర్తిగా చేపట్టడం, వాటిలో నీటిని నింపకపోవడంతో రైతులకు నష్టం చేకూరుతోంది.

## ఇజ్రాయెల్ పై మిస్సెల్ ప్రయోగం..

## దాడుల్లో మృతి చెందిన భారతీయుడు

**న్యూఢిల్లీ, మార్చి 5 (ప్రజామంటలు):** ఇజ్రాయెల్ , హమాస్ మధ్య యుద్ధం రోజు రోజుకి జరుగుతూనే ఉన్నాయి. తాజాగా లెబనాన్ కు చెందిన హెజ్బుల్లా మిలిటెంట్ గ్రూపు చేసిన యాంటీ ట్యాంక్ క్షిపణి దాడుల్లో ఓ భారతీయుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులు ముగ్గురు కేరళకు చెందినవారిగా గుర్తించారు. ఈ ఘటన సోమవారం ఉదయం 11 గంటలకు ఉత్తర సరిహద్దులోని మార్గాలియోట్ ప్రాంతంలో ఈ దాడి జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. కేరళలోని కొల్లామ్ కి చెందిన పట్నిబిన్ మాక్స్ వెల్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. జివ్ ఆస్పత్రిలో ఆయన మృతి దేహాన్ని గుర్తించారు. ఈ దాడిలో గాయపడిన జోసెఫ్ జార్జ్, పాల్ మెల్విన్ కు చికిత్స అందిస్తున్నారు. పాల్ మెల్విన్ కు శస్త్రచికిత్స జరిగినట్లు అధికారులు తెలిపారు. జార్జ్ అనే వ్యక్తిని బెలిన్ సన్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతని ముఖానికి శరీరానికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. భారత్ లోని అతని కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు తెలుస్తోంది.ఈ దాడి చేయడం హెజ్ బొల్లా పనేనని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హమాస్ కు మద్దతుగా ఈ గ్రూపు అక్టోబర్ 8నుంచి ఉత్తర ఇజ్రాయెల్ లోని పలు ప్రాంతాలపై క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లతో తరుచూ దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగానే హెజ్ బొల్లా స్థావరాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రకటించింది. హమాస్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గాజాలోని పాలస్తీనా ప్రజలు, హమాస్ నేతలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా హెజ్ బొల్లాతో ఇజ్రాయెల్ కు సవాళ్లు ఎదురవుతున్నాయి. దీంతో వీరి పైన ఐడిఎఫ్ దాడులు చేపడుతోంది. ఇప్పటికే ఈ ఘర్షణలో ఏడుగురు పౌరులతో పాటు 10 మంది సైనికులు మరణించినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులు వల్ల 229 మంది మరణించారని హెజ్ బొల్లా తెలిపింది.

# బిఆర్ఎస్‌కు వరుస దెబ్బలు

### పార్టీని వీడుతున్న నాయకులు

### పార్లమెంట్ ఎన్నికలు లక్ష్యంగా జారుకుంటున్న నేతలు

**హైదరాబాద్, మార్చి 5 (ప్రజామంటలు):** తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బీఆర్ఎస్ లో పదవులు అనుభవించిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో...నేతలంతా తమ దారి తాము చూసుకుంటు న్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను పక్కాగా అనుసరిస్తు న్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నేతలంతా...పక్క చూపులు చూస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో ఇద్దరు ఎంపీలు బీజేపీ కండువా కప్పేసుకున్నారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు పోతుగంటి రాములు, జహీరబాద్ ఎంపీ బీబీ పాటిల్... పార్టీకి రాంరాం చెప్పేశారు. వారిద్దరూ బీజేపీ కండువా కప్పుకోవడం జరిగిపోయింది. బీబీ పాటిల్‌కు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం, ఎంపీ రాములు తనయుడు భరత్‌కు నాగర్‌కర్నూలు ఎంపీ సీటు కేటాయించింది. వీరిద్దరు మొదటి జాబితాలోనే టికెట్ దక్కించుకున్నారు. మరికొందరు నేతలు కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వర్ధనపేటకు చెందిన ఆరూరి రమేశ్, వరంగల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి కూడా కారు వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి దంపతులు, తీగల కృష్ణారెడ్డిలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బద్రాచలం ఎమ్మెల్యే కూడా కారు దిగేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా జారు కుంటున్నట్లు తెలుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఓటమి పాలయింది. మూడోసారి అధికారంలోకి వస్తామని భావించిన గులాబీ పార్టీ అంచనాలు తలకిందులు అయ్యాయి. మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమంటూ కొందరు నేతలు లెక్కలు వేసుకున్నారు. కేసీఆర్ కూడా మూడోసారి గెలుస్తామని చెప్పడంతో...ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు ముందుకు వెనుక ఆలోచించకుండా కారు ఎక్కేశారు. గులాబీ పార్టీ ఓవర్ లోడ్ అని తెలిసినా...అధికారంలోకి వస్తే పదవులు వస్తాయన్న ఆశతో కండువా కప్పేసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రావడంతో...రాజకీయ పరిణామాలు చకచకా మారిపోతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ పదవులు అనుభవించిన నేతలు... ఒక్కొక్కరుగా మెల్లిగా కారు పార్టీకి గుడ్ చెప్పేస్తున్నారు. ఇటు కేంద్రం...అటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలలోకి నేతలు జంప్ అవుతున్నారు. ఇద్దరు ఎంపీలు బీజేపీలో చేరడం...అంతకుముందు పలువురు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడంతో కారు పార్టీలో కలవరం మొదలైనట్లు తెలుస్తోంది. ఇక ముందు కూడా వలసలు ఇలాగే కొనసాగుతాయా అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో మొదలైంది. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు...వలసలు ఏ స్థాయికి చేరుకుంటాయన్నది చర్చనీయాంశంగా మారింది. తాజాగా పలువురు ఎమ్మెల్యేలు కూడా ఇతర పార్టీల్లోకి వెళ్తారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఎంజాయ్ చేసిన నేతలు...గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. అయితే ఎంత మంది నేతలు వెళ్తున్నా...బీఆర్ఎస్ హైకమాండ్ పెద్దగా స్పందించడం లేదు. దీనికి కారణాలు ఉన్నాయని సొంత పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ వీడే నేతలను బుజ్జగించాల్సిన అవసరం లేదని, అధికారం లేనప్పుడు పార్టీలో కొనసాగే ఆలోచన లేని నేతలు...బయటకు పోతే మంచిదని యోచనలో హైకమాండ్ ఉంది. అధికార కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్‌ను ఖాళీ చేయించే పనిలో ఉంది. బిఆర్ఎస్‌ను దెబ్బతీసే పనిలో బిజెపి కూడా ఉంది.

# బిజెపిలో మల్కాజిగిరి సీటు చిచ్చు

### ఎందరో ఆశలను తుంచేశారని వ్యాఖ్యలు

### భవిష్యత్ కార్యాచరణ తెలియచేస్తానన్న మురళీధర్ రావు

**హైదరాబాద్, మార్చి 5 (ప్రజామంటలు):** మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా మాజీమంత్రి ఈటెల రాజేందర్ ఎంపికలో బీజేపి అధిష్ఠానం అవలంబించిన తీరుపై పార్టీలో చిచ్చు రేగుతోంది. అలాగే పార్టీలో చేరిన వెంటనే ఎంపి సీట్లు కేటాయించడంపైనా అసంతృప్తి వెల్లడవుతోంది. ముఖ్యంగా మల్కాజిగిరి సీటుపై మురళీధర్‌రావు అనుచరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈటలకు టికెట్ కేటాయించినట్లు ప్రకటన వెలువడిన తర్వాత మురళీధర్‌రావు ఓ ట్వీట్ చేయడంతో కలకలం రేగింది. 'మల్కాజిగిరిలో నా కోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు.. త్వరలోనే అనుచరులు, కార్యకర్తలను వ్యక్తిగతంగా కలుస్తా, ఆపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తా' అని ఆయన ట్వీట్ చేశారు. మల్కాజిగిరి టికెట్ కోసం బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎం.కొమురయ్య, సీనియర్ నాయకులు చాడ



సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్, మల్లారెడ్డి, పన్నాల హరీష్ రెడ్డి, సామ రంగారెడ్డి ప్రయత్నాలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు పోటీ చేశారు. ఈ సారి పోటీకి ఆయన ఆసక్తి చూపలేదు. మల్కాజిగిరి టికెట్ తనకే ఇస్తానని అధిష్టానం హామీ ఇవ్వడంతో మురళీధర్‌రావు నియోజకవర్గం లో అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రచారం చేసుకుంటున్నారు. ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటుచేశారు. చాయ్‌పే చర్చ కార్యక్రమాలతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. డిజిటల్ హిందూ కార్యక్రమాలను నిర్వహించారు. ఫిర్ ఏక్ బార్ మోదీ పేరుతో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. టికెట్ ఖరారు చేసే రోజు కూడా మూసాపేటలో అభిమానులు, అనుచరులతో సమావేశం నిర్వహించారు. పార్టీ సిద్దాంతాల కోసం పనిచేస్తున్న వారికి టికెట్ ఇవ్వడం లేదంటూ సోషల్ మీడియాలో కార్యకర్తలు, అనుచరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకులు ఎన్నికల్లో అభ్యర్థికి సహకరించకూడదని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు వారు ఇటీవల ఓ సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని విరించి ఆస్పత్రి చైర్మన్, లతా మా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలతకు కేటాయించడంతో కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులను కాదని, ఇతరులకు టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థానం నుంచి గతంలో రెండుసార్లు పోటీ చేసిన భగవంత్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ సుభా?షచందర్‌జీ, పొన్న వెంకటరమణ, రూప్‌రాజ్ టికెట్ ఆశించారు. ఈసారి టికెట్ భగవంత్‌రావు, సుభాష్ చందర్‌జీలో ఎవరికో ఒకరికి ఇస్తారని ఊహించారు. చివరకు మాధవీలతకు కేటాయించారు. మాధవీలత ఎంపికపై ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రాజాసింగ్ హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

# ఉత్తరప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ

### కేబినెట్ లో కొత్తగా నలుగురికి చోటు

**ఉత్తరప్రదేశ్, మార్చి 5 (ప్రజామంటలు):** ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం యోగి మంత్రివర్గ విస్తరణ జరిగింది. కొత్తగా నలుగురికి చోటు లభించింది. ఉత్తరప్రదేశ్ కేబినెట్‌లో ఎస్‌బీఎస్‌పీ చీఫ్ ఓం ప్రకాష్ రాజ్‌భర్, బీజేపీ నేత దారా సింగ్ చౌహాన్, ఆర్ఎల్‌డీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, బీజేపీకి చెందిన సునీల్ కుమార్ శర్మ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్ వారి చేత ప్రమాణం చేయించారు. ఓం ప్రకాశ్ రాజ్‌భర్ జహురాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. చౌహాన్ బీజేపీ ఎమ్మెల్సీ, కుమార్ పుర్కాజీ నియోజకవర్గం నుంచి మూడోసారి ఆర్ఎల్‌డీ ఎమ్మెల్యేగా ఉన్నారు. శర్మ సాహిబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ముందు కేబినెట్ విస్తరణ జరగడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే ఆర్ఎల్‌డీ.. ఎన్డీఏ కూటమిలో చేరింది. అనంతరం కేబినెట్‌లో చోటు దొరకడం విశేషం. జరగబోయే ఎన్నికల్లో బలం పుంజుకోవడం కోసమే కేబినెట్ విస్తరణ జరిగినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

# ఎన్నికలు వస్తేనే బండి సంజయ్ కి ప్రజలు గుర్తొస్తారు..



## ఐదేళ్లలో 5 రూపాయలు తీసుకురాని బండి సంజయ్ కి ఎంపీ పదవి అవసరమా!?
## ఎంపీ పదవి పునరావాస కేంద్రమా?
## కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



**సైదాపూర్ మార్చి 05 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బండి సంజయ్ మళ్లీ ఎంపీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడితే మళ్లీ పార్లమెంట్ ఎన్నికలకు వస్తున్నారు. ఐదేళ్ల లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కి ఐదు రూపాయలు అయిన తెచ్చాడా? హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరు. కేంద్రం ప్రతి ఏడాది ఇచ్చే నిధులను తానే ఇచ్చినట్లు బండి సంజయ్ చెప్పుకోవడం హాస్యస్పదం యాసంగి పంటకు రైతులకు ఇస్తామన్న బోనస్ ఏప్రిల్, మే మాసాల్లో ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గోదావరి నదిలో 5000ల క్యూసెక్కుల నీటిని వృథాగా పోనిచ్చే వారు కాదు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి.

2014లో ఎంపీగా గెలిచి కరీంనగర్ కు వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తీసుకొచ్చాను.కరీంనగర్ నుంచి మనోహరబాద్ వరకు రైల్వే ప్రాజెక్టు తెచ్చాను. పార్లమెంట్ లో విభజన హామీల అమలు కోసం ప్రశ్నించే గొంతుకనయ్యాను. బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో ఎంపీగా ఉండి ఏం అభివృద్ధి చేశాడు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచి ఐదేళ్లు అవుతున్న కూడా బీజేపీ పార్టీ కోసమే పని చేశాడు తప్ప ఏనాడైనా బండి సంజయ్ ప్రజల కోసం పని చేశాడా? ఎన్నికలు వస్తేనే బండి సంజయ్ కి ప్రజలు గుర్తుకు వస్తారని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి మళ్లీ ఎంపీ ఎన్నికలకు ఎందుకు వస్తున్నాడని బండి సంజయ్ కి ఎంపీ పదవి ఏమన్నా పునరావాస కేంద్రమా? అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఒడితేల సతీష్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.... ఐదేళ్ల పదవి కాలంలో బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదు రూపాయలు కూడా నిధులు తీసుకురాలేదని పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో బండి సంజయ్ కనీసం ఒక్క నవోదయ పాఠశాల కూడా తీసుకురాలేదని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కి ఐదేళ్లలో ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదని పేర్కొన్నారు. కేవలం 3లక్షల జనాభా మాత్రమే ఉన్న కరీంనగర్ పట్టణాన్ని స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చి కేంద్రం నుంచి వెయ్యి కోట్లు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. 2004లో ఐదుగురు ఎంపీలు గెలిచి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్ లో తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్ గారితో కలిసి గళమెత్తి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. 2006లో తెలంగాణ ఇస్తామని అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, 2009లో మళ్ళీ కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళితే 2014లో అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక రోజుకు 18 గంటలు పని చేశారని...కేవలం మూడున్నరేళ్ల కాలంలోనే కృష్ణ, గోదావరి నదులపై పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎట్టి పరిస్థితుల్లోనూ తలవంచే ప్రసక్తే లేదని, బలమైన ప్రతిపక్షంగా నిలబడి అధికారపక్షంపై పోరాటం చేయడం జరుగుతుందన్నారు. కేంద్రంలో పదేళ్ల కాలంగా ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారని 2014 నుంచి 2019 వరకు తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సమయంలో సీఎం కేసీఆర్ తో చర్చించి కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం వెయ్యి కోట్లు తీసుకొచ్చి కరీంనగర్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ తో పాటు కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారుల కోసం పార్లమెంట్ లో కొట్లాడి కరీంనగర్ చుట్టుపక్కల నాలుగు జాతీయ రహదారులను నిర్మాణం చేయించడం జరిగిందన్నారు.

2004లో కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు రైల్వేలైన్ కావాలని ఆడిగి మంజూరు చేయించామని, 2009లో పొన్నం ప్రభాకర్ ఎంపీగా గెలిచిన తర్వాత రైల్వే ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు.

2014లో తాను కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత మళ్ళీ కరీంనగర్ రైల్వే ప్రాజెక్టు పట్టాలెక్కిందని పేర్కొన్నారు. ఓట్లు దండుకోవడం కోసమే కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి...అబద్దాల పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నాను. అధికారంలోకి రాగానే రైతు ఋణమాఫీ చేస్తామని అన్నారు..ఇప్పటి వరకు రుణమాఫీ పై ఏ ప్రకటన చేయలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పగుళ్ల పేరుతో ఈ యాసంగి సీజన్ లో ప్రాజెక్టు లను ఎండబెట్టే కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని గోదావరి నదిలో 5000ల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్లి సముద్రంలో కలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యాసంగి పంటలకు సాగునీళ్లు ఇచ్చి ఉండేవారని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం రాక ముందు 5 మాత్రమే 400కేవీ సబ్ స్టేషన్లు ఉంటే.. కేసీఆర్ సీఎం అయ్యాక పదేళ్ళలో నలభై 400కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కరెంటు ఉండదు కరెంటు తీగలపై బట్టలు ఆరబెట్టుకోవాలని అప్పటి సమైక్యాంధ్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారని...కానీ తెలంగాణా రాష్ట్రం వచ్చే నాటికి 7778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేదని, ఇప్పుడు 26 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని....పదేళ్ల కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ యాసంగి వరి పంట ఎప్రిల్, మే మాసాల్లో కోతలకు వస్తుందని...ఎన్నికల సమయంలో క్వింటాలుకు ?500ల బోనస్ ఇస్తామని చెప్పారని..ప్రభుత్వం రైతులకు బోనస్ ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును సిరసావహిస్తామని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని...రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై మళ్ళీ గులాబీ జెండా ఎగరాలని, కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గోపాల్ రావు, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, సంజీవరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండ గణేష్, కాగిత రాములు బత్తుల కొమురయ్య రాజిరెడ్డి రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి డైరెక్టర్లు ప్రకాష్ రెడ్డి మహిపాల్ రెడ్డి సంపత్ రవీందర్ వీరారెడ్డి తిరుపతిరెడ్డి రాజయ్య కొమురయ్య యూత్ స్వామి నరేష్ సురేష్ అనిల్ రాజు మహేష్ ఇమామ్, వంశీ చందర్ రెడ్డి, దేవక్క, సునీత, రాజేశ్వర్ రెడ్డి, ఓదెలు, శ్రీనివాస్ యూత్ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు మండల స్థాయి నాయకులు శంకర్ నాయక్ శ్రీనివాస్ నాయక్ మురళి నాయక్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహర్షి దయానంద సరస్వతీ ద్విశతాబ్ది జయంతి వేడుకలు
### కన్నుల పండువగా శోభాయాత్ర



**సికింద్రాబాద్ మార్చి 05 (ప్రజామంటలు):** మహర్షి దయానంద సరస్వతీ ద్విశతాబ్ది (200 వ) జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం సీతాఫల్మండి ఆర్య సమాజ్ లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. వైదిక్ పాఠశాల విద్యార్థులు పండితులు శోభాయాత్రలో పాల్గొన్నారు.పలువురు పండితులు ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆర్య సమాజ్ అధ్యక్షుడు గంగాధర్, మాతాజీ జ్యోతిశ్రీ, సభ్యులు పాల్గొన్నారు.

## సమరసత వేదిక ఆధ్వర్యంలో కుటుంబ సమ్మేళనం






**జగిత్యాల రూరల్ మార్చి 05 (ప్రజామంటలు):** పొరండ్ల గ్రామంలోని భీమన్న దేవాలయం ఆవరణలో సామాజిక సమరసత వేదిక తరపున 'కుటుంబ సమ్మేళనం' నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పుధానవక్తగా పాల్గోని ప్రసంగించారు. వీరు తమ పుసంగంలో గోమాత "గొప్పతనాన్ని మన కుటుంబంలో, పర్యావరణంలో గోవు ఎంతటి ప్రాధాన్యతను కలిగి ఉంటుందో వివరించారు. అలాగే కుటుంబం యొక్క ప్రాధాన్యత గురించి కూడ తెలపారు సమాజం కులపరమైన తేడాలు. లేకుండా , సమరసత దిశ గా ఆడుగులు వేయాలని, కులాలు మన సామాజిక అవసరాలు తీర్చడానికి ఏర్పడినాయే తప్ప సమాజ విభజనకు కాదని సూచించారు. రామాయణ కాలం నుంచే మనకు కుల పరమైన వ్యత్యాసాలు లేని సమాజం నిర్మితమై ఉందని అందుకు రాముడే నిదర్శనమని తెలిపారు. ఈ సమా వేశంలోనే సమరసత గౌరవ అద్యక్షులు కనికరం మాతృమూర్తి శతవసంతాలు పూర్తి చేసుకోవటంతో దేవాలయ ప్రాంగణంలో ఆయుస్య హోమం నిర్వహించి వారి తల్లి ని కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సమరసత జిల్లా అద్యక్షులు బిట్ల గంగాధర్, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి సోమిరెడ్డి భూచురెడ్డి, గీత ఆశ్రమ నిర్వాహకులు నేముల రాజశెడ్డి పాల్గోన్నారు.

## ఆత్మరక్షణకై విద్యార్థినిలు కరాటే నేర్చుకోవాలి
### జిల్లా విద్యాధికారి బి. జగన్మోహన్ రెడ్డి

**జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు):** కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ హై స్కూల్) లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థినిలకు కరాటే శిక్షణ జరుగుతున్న సందర్భంగా జిల్లా విద్యాధికారి బి జగన్మోహన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ కార్యక్రమం గత నాలుగు నెలల నుండి కరాటే క్లాసులు జరుగుతున్నాయని, దీనివలన ఆడపిల్లలకు ఆత్మ రక్షణతో పాటు మానసిక శారీరక దారుఢ్యం కలుగుతుందని ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవడానికి ఈ కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఇట్టి అవకాశంను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. చంద్రకళ, పిఆర్టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు, తపస్ జిల్లా అధ్యక్షులు బోనగిరి దేవయ్య ఉపాధ్యాయులు, సూర్యప్రకాష్ శ్రీనివాస్, పద్మ, విద్యా దేవి పాల్గొన్నారు.



## అంబేద్కర్ అభయ హస్తం హామీలు అమలు చేయాలి
### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**సారంగాపూర్ మార్చి 05 (ప్రజామంటలు):** మండలములోని లక్ష్మీదేవి పల్లి గ్రామంలో నల్ల పోచమ్మ దేవి ఆలయం వద్ద 1 లక్ష 50 వేల నిధులతో బోర్ మోటర్ మంజూరు చేసిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి శాలువా తో సత్కరించి, ధన్యవాదాలు తెలిపిన లక్ష్మీదేవిపల్లి గ్రామ అంబేద్కర్ సంఘం సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలలో పల్లెల రూపురేఖలు మారాయనీ గుర్తు చేసారు. అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సాగిందన్నారు. గ్రామంలో రెవెన్యూ భూమిలో మామిడి తోటకు సైతం బోరు మంజూరుకు కృషి చేస్తామన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రహదారులు పార్కులు వైకుంఠధామాలు గ్రామపంచాయతీ భవనాలు కంపోస్ట్ చేయడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సురేందర్, నాయకులు చిట్ల రమణ, మ్యాకల శేఖర్, మైలారపు రాజం, మ్యాకల గంగ లచ్చం, మైదారపు రాజయ్య, కుంటాల చిన్నరాజం, కుంటాల శేఖర్, మ్యాకల వెంకటరాజం, పసుల రాజు, గంగాధర్, రిషెందర్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమాన, జైలు తప్పదు

## రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
### గడిచిన నెల రోజులో మద్యం సేవించి వాహనలు నడిపిన 956 మంది పై కేస్ లు నమోదు
### ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్



**జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు):** గడిచిన నెల రోజులో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ లలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 956 మంది వ్యక్తులకు పట్టుకోవడం జరిగింది అని ఇందులో 233 మంది వ్యక్తులకు కోర్టు ద్వారా 198400/- రూపాయల జరిమానలు విధించడం జరిగిందిని ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే సెక్షన్ 304-%××% కేసు లు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా లో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి తల్లదండ్రులకు బాధ్యత వహించాలనీ హెచ్చరించారు. వాహనదారులు, రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

## వృద్ధులను వేధిస్తే చట్టపరంగా చర్యలు




**జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు):** వయోవృద్ధులను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జగిత్యాల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సూరం వేణుగోపాల్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలిసారు. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి,సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ఆవిర్భావ ప్రత్యేక సావనీర్ ను అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ సీనియర్ సిటిజెన్లపై జరుగుతున్న వేదింపులను సి.ఐ. దృష్టికి తీసు కెళ్లారు. సి.ఐ.మాట్లాడుతూ.... సీనియర్ సిటీజన్లను వేధింపులకు గురిచేసే వారిపై పోలీసు శాఖ పరంగా కౌన్సెలింగ్ చేసి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, గౌరవ సలహాదారు,మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్. దేశాయ్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పట్టణ అధ్యక్షుడు పి. సతీశ్ రాజ్, కోశాధికారి సింగం గంగాదర్, ఎం.డి. యాకుబ్, పుల్లూరి సత్యనారాయణ, పడాల శ్రీనివాస్, ములస్తం శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టికి సీనీయర్ల రాజీనామా



**జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజక వర్గ బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు ఉద్యమ కారులు బిఆర్ఎస్ పార్టి (టీఆర్ఎస్) ఆవిర్భవం నుండి పనిచేస్తూ ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని, పార్టి అధికారము లోకి రావడం కొరకు అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. 10 సంవత్సరములు పార్టీ అధికారములో ఉన్నప్పటికి ఏ ఒక్కరికి న్యాయము జరగలేదనీ అభిప్రాయం వ్యక్తం చేసారు. పార్టీ కోసం ఏలాంటి ఏ పనిచేయని వారికి, ఏనాడు జై తెలంగాణా అననివారికి సైతం పదవులు కట్ట పెట్టి మమ్ములను అవమనించారని తెలిపారు. ఇలాంటి నియంతృత్వ దోరిణికి మరియు అహంకార పూరిత ప్రవర్తనతో గల నాయకత్వములో పని చేయుటకు ఇష్టము లేక బాధాతప్త హృదయముతో మూకుమ్మడిగా బిఆర్ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వమునకు రాజీనామ చేస్తున్నామన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన



**జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా మహిళ సాధికారత, లింగ వివక్షత, చిన్న పిల్లలపై హింస పై అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. మహిళల, పిల్లల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళలు, పిల్లలపై జరిగే అకృత్యాల నివారణకై ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటు చేశారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమెన్ హెల్ప్ లైన్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 , చైల్డ్ హెల్ప్ లైన్ కోసం 1098 నెంబర్ లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు దయావతి,యతీశ్వరి, నీలవేణి, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఓటుహక్కు వినియోగం పై అవగాహన



**కాగజ్ నగర్ మార్చి 05 (ప్రజామంటలు):** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి ద్వారా జిల్లా కలెక్టర్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆదేశాల ప్రకారం కాగజ్ నగర్ మున్సిపల్ ఆఫీస్ లో జిల్లా శిశు, మహిళా, వయోధికుల, వికలాంగుల సంక్షేమ శాఖాధికారి ఆడెపు భాస్కర్ ఆధ్వర్యంలో ఓటు వినియోగం పై అవగాహన కల్పించారు, ఈసందర్భంగా అధికారి భాస్కర్, మార్త సత్యనారాయణ గార్లు మాట్లాడుతూ.... విలువైన ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు,మొదటి సారి కలుసుకున్న సందర్భంగా సీనియర్ సిటిజన్లు అధికారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్లు ఎఎస్ఆర్ మూర్తి, నారాయణ, రమణయ్య,దేవయ్య, ఎస్ ఏ రామయ్య, దివ్యాంగుల నాయకులు అశోక్, కయ్యూమ్, జాకీర్, ట్రాన్స్ జెండర్స్ తేజస్విని, సౌజన్య ,ప్రభుత్వ సిబ్బంది హెల్ప్ లైన్ కన్వీనరు రవికుమార్, యశోద డీ.పిఎం, సిడిపిఒ సురేఖ, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా లతా కిషన్ సింగ్



**సికింద్రాబాద్ మార్చి 05 (ప్రజామంటలు):** రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా లతా కిషన్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత ఉత్తర్వులు జారీ చేశారు. తనపై విశ్వాసంతో పార్టీ పదవినిచ్చిన సికింద్రాబాద్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్, పార్టీ నాయకులకు ఈసందర్భంగా లతా కిషన్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ధర్మపురి మార్చి 05 (ప్రజామంటలు): శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా భక్తి శ్రద్ధలతో, ముందస్తు ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మార్చి 20 నుండి ఏప్రిల్ 01 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం ధర్మపురి తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... గత సంవత్సరం నిర్వహించిన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం కూడా అంతకు మించి నాణ్యమైన సేవలందిస్తూ బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని అన్నారు. పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసి, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, పౌర సంబంధాలు, ఎండోమెంట్, గ్రామీణ మంచినీటి సరఫరా, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, మత్స్య శాఖ, రెవెన్యూ, తదితర శాఖల సమన్వయ సహకారంతో బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ప్రణాళికలు, ఏర్పాట్లతో విజయవంతం చేయాలని అన్నారు. ఈ సారి ఉత్సవాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో భక్తులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, క్యూలైన్ల నిర్వహణ, నిరంతర బందోబస్తు ఏర్పాటు 350 మంది పోలీస్ సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ముఖ్యంగా వేసవి కాలం సమీపిస్తున్న సందర్భంలో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు, టెంట్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. శాశ్వత ప్రాతిపదికన సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వేసవి కాలం సందర్భంగా భక్తులకు దేవాలయం, గోదావరి నదీ తీరం, కోనేరు ప్రాంతం, తదితర ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని స్వచ్ఛంధ సంస్థల సహకారం తీసుకోవాలని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు తీసుకునే జాగ్రత్తలకు సంబంధించిన సలహాలు, సూచనలు తెలిపే విధంగా ప్రచార సామగ్రిని పంపిణి చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం కోసం రాష్ట్రంలోని బస్సులపై బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రచార సామాగ్రిని అంటించాలని, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అవసరమైన బస్సులను సమకూర్చాలని తెలిపారు. ధర్మపురి పట్టణ ప్రాంతంలోని అన్ని వార్డులలో, గోదావరి పరివాహక ప్రాంతంలో, భక్తులు బస చేసే ప్రాంతాలలో శానిటేషన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, ముఖ్య కూడళ్ళలో చలివెంద్రాలను ఏర్పాటు చేయాలని, నిరంతర పారిశుధ్య పనులు నిర్వహించడానికి మూడు షిఫ్టులలో సిబ్బందిని నియమించాలని సూచించారు. త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విద్యుత్ సరఫరలో అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా అగ్నిప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు సంభవించినపుడు తక్షణ చర్యలు చేపట్టడానికి అగ్ని మాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. దేవాలయానికి సంబంధించిన, బ్రహ్మోత్సవాల వివరాలను ఎప్పటికప్పుడు భక్తులకు తెలిసే విధంగా వివిధ ప్రసార మాధ్యమాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. వాహనాలకు అంతరాయం కలుగకుండా రోడ్లను ఎప్పటికప్పుడు సక్రమంగా ఉంచేందుకు ఆర్.అండ్ బి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సత్యవతి గుండం, బ్రహ్మ గుండం ప్రాంతాలలోకి భక్తులెవరు వెళ్ళకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భక్తులు గోదావరీ నదిలో స్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లలో భాగంగా 50 మంది గజ ఈతగాళ్లను నిరంతర పర్యవేక్షణ చేస్తూ అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలకు కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, స్థానిక వ్యాపారస్తులు, దాతల సహకారంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలను సవ్యంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలతో నిర్వహించాలని అన్నారు.

# అర్హులందరికీ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు

## కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా




జగిత్యాల మార్చి 05 (ప్రజామంటలు): ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారెంటీ పథకాల డాక్యుమెంట్ సేకరణ, ప్రజాపాలన సేవా కేంద్రాల సాఫ్ట్ వేర్ పై జిల్లా, అడిషనల్ కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా రివ్యూ నిర్వహించిన విద్యుత్ శాఖ కార్యదర్శి, సిజిజి. హెడ్ అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ హెడ్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదుపై జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర తో కలిసి సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయం నుంచి పాల్గొన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రజాపాలన సాఫ్ట్ వేర్ ద్వారా లబ్దిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి పలు ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదేవిధంగా మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం క్రింద క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేశామని, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. గృహ జ్యోతి క్రింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేయడం జరుగుతున్నదని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తు దారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్వేర్ పనితీరును క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణంగా వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకనూ లబ్ధిదారులు ఉన్నట్లయితే వారి వివరాలను సాఫ్ట్ వేర్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ గౌతమ్ రెడ్డి, డిప్యూటి సి.ఈ.ఓ. రఘువరన్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఈ.డి.యం. మమత, మునిసిపల్ కమిషనర్ లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ మర్యాదను తుంగలో తొక్కిన మోడీ

## కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒక్కటంటూ విమర్శలా

## కాళేశ్వరంపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పండి

## ప్రధాని మోడీకి ఎమ్మెల్యే మల్‌రెడ్డి సవాల్



హైదరాబాద్,మార్చి5 (ప్రజామంటలు): ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తే స్వాగతం పలికి సీఎం రేవంత్ రెడ్డి మంచి సాంప్రదాయాన్ని పాటించారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కోసమే ప్రధానిని సీఎం కలిశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మర్యాదను ప్రధాని మోదీ నిలబెట్టుకోలేదన్నారు. ప్రధాని మోదీ తన స్థాయి దిగజార్చుకొని మాట్లాడారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అని ప్రధాని వ్యాఖ్యానించడం సరైనది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాపాలపైన రేవంత్ రెడ్డి గతంలో కేంద్రానికి ఎన్నో ఫిర్యాదులు చేశారని గుర్తుచేశారు. భూఆక్రమణలు, ప్రాజెక్టుల్లో అక్రమాలు,అవినీతిపైన చేసిన ఫిర్యాదులను కేంద్రం చెత్త బుట్టలో వేసిందన్నారు. పార్లమెంటులో బీజేపీకి బీఆర్ఎస్ అనేక సార్లు మద్దతు పలికిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలని మండిపడ్డారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం అని విమర్శించిన ప్రధాని ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంపైన విజిలెన్స్ విచారణ జరిపిస్తుంది తమ ప్రభుత్వం కాదా అని నిలదీశారు. కేసీఆర్‌ను కాపాడుతుంది బీజేపీ ప్రభుత్వమే అని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదని, ఆమెను కాపాడుతున్నది ఎవరని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్‌ను జైలుకు పంపినప్పుడే బీజేపీని తెలంగాణ ప్రజలు నమ్ముతారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేశారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# ఉద్యోగాల భర్తీపై రేవంత్ అబద్ధాలు

## బిఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



హైదరాబాద్,మార్చి5 (ప్రజామంటలు): సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రావణ్ అన్నారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని అన్నారు. అబద్ధాల పునాదుల మీద రేవంత్ పాలన చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ సమర్థుడైతే కొత్తగా ఉద్యోగాలు సృష్టించాలని సూచించారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని అనడం రేవంత్ నయవంచనకు పరాకాష్టగా మారిందని అన్నారు. ఉద్యోగాల ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఆధిపత్య ధోరణితో మాట్లాడుతూ బీసీలను అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ వైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీని అధికారంలో నుంచి దించేయాలని చూస్తుంటే రేవంత్ ఆయనే ప్రధానిగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య తెలంగాణలో చీకటి ఒప్పందం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. గుజరాత్ మోడల్ అబద్ధాల మోడల్ అని కాంగ్రెస్ అధిష్ఠానం అంటే ..రేవంత్ దాన్ని గొప్ప మోడల్ అంటున్నారని విమర్శించారు. మూడోసారి మోదీని ప్రధాని చేయాలని రేవంత్ తపిస్తున్నారని దాసోజ్ శ్రావణ్ అన్నారు.

# సిఎం రేవంత్‌తో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె భేటీ



హైదరాబాద్,మార్చి5 (ప్రజామంటలు): చేవెళ్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కాలె యాదయ్య మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. తన నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం రేవంత్ తో ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ఆయన సచివాలయానికి వచ్చారు. ఇటీవల భద్రాచలం బిఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రేవంత్ రెడ్డిని కుటుంబ సమేతంగా కలిశారు. వీరితోపాటు సీఎం రేవంత్ ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో సునితా లక్ష్మారెడ్డి, మాణిక్ రావు, గూడెం మహిపాల్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్ లు ఉన్నారు. దీంతో వీరంతా బిఆర్ఎస్ రాజీనామా చేసి త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం కూడా జరుగిన సంగతి తెలిసిందే.



# సర్దార్ పటేల్ కాలేజీలో స్టూడెంట్స్ బ్లడ్ డొనేషన్

సికింద్రాబాద్ మార్చి 05 (ప్రజామంటలు): సర్దార్ పటేల్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇంచార్జీ, ఆర్ఎంవో డా. సత్యరత్న నేతృత్వంలో సిబ్బంది స్టూడెంట్స్ నుంచి బ్లడ్ సేకరించారు. 103 మంది ఎన్.ఎస్.ఎస్. తో పాటు ఆయా విభాగాల్లో చదువుతున్న విద్యార్థులు రక్త దానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడే వారిని ఆదుకునేందుకు అవసరమైన బ్లడ్ ను అందించిన విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డా. అమర్ నాథ్ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి కే. బాబు, బి. రాజశేఖర్, తెలుగు విభాగ అధ్యక్షులు బి. రమేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాహుల్, గాంధీ ఆసుపత్రి బ్లడ్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జమదగ్నికి హాజరైన ఎమ్మెల్యే కడియం



వేలేరు మార్చ్ 05 (ప్రజామంటలు): ధర్మసాగర్ మండలంలోని జానకిపురం గ్రామంలో ఎల్లమ్మ బోనాలకు హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జానకిపురం గ్రామస్థులందరూ కలిసి అమ్మవారికి బోనాల పండగ ను వైభవంగా నిర్వహించారు. పూజారులు ఎమ్మెల్యే కు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడికి వచ్చిన భక్తులతో కాసేపు ముచ్చటించారు. ఈకార్యక్రమంలోగ్రామపెద్దలు,యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వంజర సంఘ కమిటీ హాల్ కోసం మంజూరైన రూ. లక్ష చెక్కు అందజేత



మెట్ పల్లి మార్చ్ 05 (ప్రజా మంటలు): మెట్ పల్లి మండలం అమ్మక్క పేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వంజర సంఘం నుండి అమ్మక్క పేట వంజర సంఘ భవన కమిటీ హాల్ కోసం మంజూరైన ఒక లక్ష రూపాయల చెక్కును అమ్మక్క పేట వంజర సంఘ అధ్యక్షులు కార్యవర్గానికి తెలంగాణ రాష్ట్ర వంజరి సంగ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బొమ్మల శంకర్ అందజేశారు. అనంతరం రాష్ట్ర సంఘ నాయకులు బొమ్మల శంకర్ మాట్లాడుతూ.... రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేష్ ఆదేశాల మేరకు అమ్మక పేట గ్రామ వంజరి సంఘం కమ్యూనిటీ భవనం కోసం ఒక్క లక్ష రూపాయలు చెక్కును అందజేస్తున్నట్లు అదే విధంగా సంఘ భవనాలకు కమ్యూనిటీ హాల్లో అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తుందని విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు వంటి ఎన్నో కుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. అదేవిధంగా అమ్మక పేట వంజర సంఘానికి నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులకు అలాగే ఎగ్జిక్యూటివ్ నెంబర్ బొమ్మల శంకర్ అన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు గ్రామ వంజర సంఘం అధ్యక్షుడు కార్యవర్గం కుల బాంధవులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షులు కరిపే సత్యనారాయణ, నవాత్ రాజేందర్, పి. ప్రసాద్, నాగయ్య, మల్లేష్, నరసయ్య, నవీన్, నల్ల వెంకటేశ్వర్లు, భూమేశ్వర్, చిన్నయ్య, నరేష్, బలరాం తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంవీఐ వేణును సత్కరించిన ట్రస్మా కార్యవర్గం



హుజురాబాద్ మార్చి 05 (ప్రజామంటలు) : హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన కంచి వేణు ను మంగళవారం హుజూరాబాద్ ట్రస్మా నాయకత్వం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవరెడ్డి, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షులు వి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు రాజకుమార్, మాడిశెట్టి ప్రసాద్, తిరుపతి యాదవ్, పరాంకుశం కిరణ్ కుమార్, కామని రవీందర్, పిల్లల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ హాస్టల్‌లో విద్యార్థి మృతి బాధాకరం

## మూడు నెలల్లో సమస్యలు తీర్చని రేవంత్

## ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు



కామారెడ్డి,మార్చి5 (ప్రజామంటలు) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తిప్పారం గ్రామానికి చెందిన విద్యార్థి హర్యల వెంకట్ బోధన్ హాస్టల్‌లో జరిగిన సంఘటనలో మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, పట్టింపులేని చర్యలే ఈ దారుణానికి కారణమని అన్నారు. బోధన్ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు చనిపోయారు. మరో ఎనిమిది మంది విద్యార్థులపై హత్య కేసు నమోదైంది. హాస్టల్‌లో వార్డెన్, వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో విద్యార్థుల ఘర్షణను ఆపేవారు లేకుండాపోయారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేశారు. కవిత మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై పడి ఏడవడం తప్ప ఈ మూడు నెలల్లో ప్రజలకు చేసిందేమీ లేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థుల చావులు చూశాం. ఆ తర్వాత గత మూడు నెలల్లోనే చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు విద్య శాఖకు మంత్రి లేకపోవడం మన దురదృష్టం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రివ్యూ నిర్వహించి పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఇదేనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన. ఇప్పటికైనా గురుకుల పాఠశాలల్లో వాచ్‌మెన్ లేకపోతే ఒక పోలీస్ కానిస్టేబుల్‌ని నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరాము. మృతుడి తల్లికి పెన్షన్, సోదరునికి ప్రభుత్వ ఉద్యోగం, 15 లక్షల నష్టపరిహారం, ఒక డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.' అని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై కిషన్ రెడ్డి బురద జల్లుతున్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి



హైదరాబాద్,మార్చి5 (ప్రజామంటలు): రాజకీయంగా ఎన్నికల సమయంలో పొత్తులు సాధారణం అని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. బీఎస్పీతో పొత్తు కోసం రాష్ట్రంలో సంప్రదింపులు జరిపాం.. కానీ, జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో బీఎస్పీ లేదు.. ఇపుడు బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తు కుదుర్చుకుంది.. ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా తెలంగాణలో కాంగ్రెస్ దే గెలుపు అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ జాతీయ నేత కేసి వేణుగోపాల్ ను కలిశాను.. రాష్ట్ర రాజకీయాలు, నాగర్ కర్నూల్ అంశంపై కూడా చర్చించాను.. నాగర్ కర్నూల్ టికెట్ విషయంలో నాకు డౌట్ లేదు అని మల్లు రవి చెప్పుకొచ్చారు.ఇక, మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా పెద్దన్నలా పని చేయాలని సీఎం రేవంత్ చెప్పారు.. దానికి కిషన్ రెడ్డి రేవంత్ నే వెళ్లి అడగండి అని మీడియాతో అనడం ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం అని మల్లు రవి చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని రేవంత్ కోరలేదు.. రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.. రాజ్యాంగ స్ఫూర్తికి వక్ర భాష చెప్పడాన్ని ఖండిస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. ఏ ప్రధాని ఉన్నా మేం గౌరవిస్తాం.. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కిషన్ రెడ్డి మాట్లాడారు.. 6 గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారో అర్థం కావడం లేదు అని కిషన్ రెడ్డి అంటున్నారు.. ఇప్పటికే 18 కోట్ల ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయణిస్తున్నారు తెలిపారు.. గద్వాలలో 1200 మంది 10 లక్షల చొప్పున ఉచితంగా వైద్య సౌకర్యం పొందారు.. రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది ఉచిత వైద్య సదుపాయాలు పొందుతున్నారు.. పథకాల అమలు అర్ధం కాకపోతే ఆర్టీఐ ద్వారా వివరాలు తెలుసుకోవాలి అని సూచించారు. కిషన్ రెడ్డి కాంగ్రెస్ పై కావాలనే బురద జల్లుతున్నారు అని ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి వెల్లడించారు.

# ప్రభాస్‌తో మళ్లీ సినిమా చేయాలని ఉంది


## భీమా చిత్ర విశేషాలను పంచుకున్న గోపీచంద్



విజయం కోసం పరితపిస్తున్న నటుల్లో గోపీచంద్ ఇప్పుడు 'భీమా' అనే సినిమాతో మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది, ఈ సినిమా నేపథ్యం పరశురామ క్షేత్రం అని చెప్పారు. డిసెంబర్‌లో విడుదల చెయ్యాలని అనుకున్నా..అప్పట్లో 'సలార్' లాంటి పెద్ద సినిమా రావటం వల్ల వాయిదా వేసుకున్నారు. జనవరిలో కూడా పండగ సినిమాలు చాలా వున్నాయి, ఇక ఆలా వాయిదా పడుతూ ఇప్పుడు మార్చి 8, మహా శివరాత్రికి విడుదల కానుంది. 'భీమా' సినిమా గురించి గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమా అన్ని భావోద్వేగాలు కలగలిపిన ఒక వాణిజ్యపరమైన సినిమా. తప్పకుండా ఆడుతుంది అనే నమ్మకం మాత్రం వుందని చెప్పారు. దర్శకుడు హర్ష ఈ కథ నాకు చెప్పేటప్పుడు, భీమా పాత్రకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. ఇంతకు ముందు పోలీసాఫీసర్ పాత్రలు చేసినా అందులో కథ అంతా ఆ పోలీసు పాత్ర చుట్టూ తిరుగుతాయి, కానీ ఇందులో అలా కాదు, వేరేలా ఉంటుంది, ఒక చిన్న సెమి ఫాంటసీ కూడా ఉంటుంది, ఆ పాయింట్ కొత్తగా ఉండటమే కాకుండా నాకు బాగా నచ్చి ఈ సినిమా చేసాను అని గోపీచంద్ చెప్పారు.'భీమా'లో కూడా రెండు పాత్రలు ఒకటి పోలీసాఫిసర్, రెండోది ఒక శక్తివంతమైన పాత్ర వున్నాయి. 'అఖండ' సినిమాతో ఈ 'భీమా' పోల్చడం నాకైతే మంచిదే అనిపిస్తుంది. ఈ సినిమాలో



పోరాట సన్నివేశాలు వున్నాయి, అలాగే వినోదాత్మక సన్నివేశాలు కూడా చాలా వున్నాయి. దీనికితోడు మంచి భావోద్వేగాలు వున్నాయి. పోరాట సన్నివేశాలలో హీరో వెళ్లి పది ఇరవై మందిని కొడితే ప్రేక్షకుడు చాలా బోర్ ఫీల్ అవుతాడు, ఒక సెన్స్ లేకుండా పోతుంది, అదే అందులో ఒక భావోద్వేగం వుండి, ఆ పోరాట సన్నివేశం చేస్తే, చేసేవాళ్ళకి, చూసే వాళ్ళకి కూడా హత్తుకుంటుంది. ఈ సినిమాలో అన్ని అలా కుదిరాయని చెప్పారు. 'లౌక్యం' లాంటి సినిమాలు' అని చెప్పారు. 'లౌక్యం' విజయం సాధించింది. 'భీమా'లో అన్ని ఎలెమెంట్స్ వున్న సినిమా, బాగుంటుంది అనే అనుకుంటున్నా. ప్రతి సినిమా విజయం సాధించాలని ప్రతి నటుడు కష్టపడి చేస్తారు. 'భీమా' సినిమా దర్శకుడు హర్ష ఈ సినిమా లో కథనం, ట్విస్ట్ లు అన్నీ బాగా చూపించగలిగాడు. పాన్ ఇండియా సినిమా కోసం కథ రాసుకుంటే నడవదు, ఎందుకంటే హిందీ ప్రేక్షకులకి, మన ప్రేక్షకులకి చాలా విషయాల్లో వ్యత్యాసం వుంది. ఇప్పుడు ఒక్క ప్రభాస్ కి తప్పితే ఏ నటుడూ కూడా పాన్ ఇండియా సినిమాలు చెయ్యడం లేదు, ఆ నటులకి కథలు రాయటం లేదు. ఎప్పటికైనా ప్రభాస్ తో మళ్ళీ కలిసి సినిమా చెయ్యాలని వుంది అని చెప్పారు గోపీచంద్. అతనొక్కడితోటే కాదు, మిగతా నటులతో కూడా కథ నచ్చితే సినిమా చేస్తాను అని చెప్పారు. తన రాబోయే సినిమాల గురించి మాట్లాడుతూ దర్శకుడు శ్రీను వైట్ల తో సినిమా 30 శాతం పూర్తయిందని, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తో ఒక సినిమా ఉందని, అలాగే దర్శకుడు రాధాకృష్ణతో కూడా కథా చర్చలు జరుగుతున్నాయని, ఆ సినిమా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుందని చెప్పారు.



# అల్లు అర్జున్ నటనంటే ఎంతో ఇష్టం

## నటి సమంత హాట్ కామెంట్స్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించింది అగ్ర కథానాయిక సమంత. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ వీడియోలు వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ కాలేజీ ఫెస్ట్‌లో పాల్గొన్న సమంతను కొందరు స్టూడెంట్స్ 'నటనలో మీకు స్ఫూర్తి ఎవరు?' అని అడిగారు. 'యాక్టింగ్‌లో నాకు అల్లు అర్జున్ స్ఫూర్తి అని సమాధానమిచ్చింది. తనతో కలిసి మరోసారి సినిమా చేయాలనుకుంటున్నా. ఎందుకంటే యాక్టింగ్ బీస్ట్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు బన్నీ' అని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ వీడియోలను బన్నీ ఫాన్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. గతంలోనూ ఓ సందర్భంలో సమంత ఇదే విషయాన్ని చెప్పింది. అల్లు అర్జున్ తన సూపర్ హీరో అని చెప్పింది. వీళ్లిద్దరూ కలిసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి'లో నటించారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా చక్కని విజయాన్ని అందుకొంది. అలాగే సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'పుష్ప'లో అల్లు అర్జున్, సమంత 'ఊ అంటావా..' పాటకు స్టెప్పులేశారు. ఈ పాట పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది. ఇందులోనూ ఓ ఐటెమ్ సాంగ్ ఉందని టాక్. అయితే ఇందులో ఆ పాటలో సమంత కనిపిస్తారా లేక వేరే హీరోయిన్ ఎవరైన కనిపిస్తార అన్నది తెలియాల్సి ఉంది.



# మహేశ్‌బాబు సినిమా కోసం రాజమౌళి కసరత్తు



మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందబోయే సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే నిర్మాణ సంస్థ నుంచి గానీ, దర్శకుడి నుంచి గానీ ఇప్పటిదాకా అధికారికంగా ఎలాంటి అప్‌డేట్ లేదు. కానీ రోజుకో కొత్త విషయం వైరల్ అవుతూనే ఉంది. దీనిపై సినిమా టీమ్ ఎక్కడా స్పందించలేదు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి స్పందిస్తూ, 'మహేశ్‌తో సినిమా తీస్తున్నా. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ టైటిల్ ఇంకా ఖరారు కాలేదు' అని అన్నారు. ఇప్పుడు మహేశ్‌బాబు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరొక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'రాజమౌళి సర్‌తో చేసే సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు చాలా బాగా జరుగుతున్నాయి. త్వరలోనే ఆయనతో ప్రయాణం మొదలుపెట్టడానికి చాలా ఆసక్తిగా ఉన్నా' అని అన్నారు. ఈ అప్‌డేట్‌తో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు నన్ను బాగా ప్రభావితం చేసి, నా కెరీర్‌ను మలుపు తిప్పాయని మహేశ్ బాబు అన్నారు. డిఫరెంట్ స్టోరీ లైన్లతో తెరకెక్కించిన ఈ చిత్రాలు ఆడియన్స్ కు నన్ను మరింత దగ్గర చేశాయి. ప్రేక్షకులకు నచ్చేలా సినిమాలు చేయాలని నైతిక అంశాల ఆధారంగా కథను ఎంపిక చేసుకుంటాను. ఒకే రకమైన పాత్రల్లో నటించడం నాకు నచ్చదు. వ్యక్తిగత విలువలకు దగ్గరగా ఉంటూ, నా స్వభావాన్ని అభిమానులకు తెలియజేసేలా ఉన్న పాత్రలు పోషిస్తా. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు ముఖ్యమైనప్పటికీ సినిమా ప్రేక్షకులపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొంటున్నా. అందులో భాగంగానే 'గుంటూరు కారం'లో నటించాను. ఈ చిత్రానికి సవాళ్లు ఎదురైనా ప్రేక్షకుల ఆదరణ పొందింది. నా అభిమానులే ఇందుకు కారణం. ఒక సినిమాకు సైన్ చేశానంటే అది పూర్తయ్యేదాకా దర్శకుడి విజన్ ప్రకారమే నడుచుకుంటా' అని మహేశ్ బాబు అన్నారు. మహేశ్ బాబు చిత్రంతో భారతీయ సినిమా చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని ఇటీవల రచయిత విజయేంద్రప్రసాద్ చెప్పారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కూడా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లోనూ అనువదించనున్నారు. ఇప్పటివరకూ వెండితెరపై కనిపించని సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపిస్తారని, ఆ దిశగా జక్కన్న పాత్రను తీర్చిదిద్దనున్నారని మొదటి నుంచి టాక్ వినిపిస్తోంది. గడ్డం పెంచి, పొడవాటి జుట్టుతో ఇందులో కనిపించనున్నారని తెలుస్తోంది. అదే సమయంలో దృఢంగా కనిపించేందుకు అవసరమైన కసరత్తులు మహేశ్ చేస్తున్నారు. ఇటీవల మహేష్ లుక్‌కి సంబంధించిన స్కెచ్లు పూర్తయ్యాయని తెలిసింది. మొత్తం ఎనిమిది డిఫరెంట్ లుక్స్ జక్కన్న టీమ్ రెడీ చేసిందట. కథకు, మహేశ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయేలా ఆ లుక్స్ మహేశ్‌ను టెస్ట్ ఫొటో షూట్ చేసి, ఫైనల్ లుక్ ఖరారు చేయనున్నారని సమాచారం!



## శరవేగంగా దేవర చిత్ర నిర్మాణం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' కొరటాల శివ దర్శకుడు. కొంతగ్యాప్ తర్వాత మళ్లీ ఈ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుగుతుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేక సెట్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివ. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సన్నివేశాలను ఎన్టీఆర్, మురళీశర్మ తదితరులపై చిత్రీకరణ చేస్తున్నారు. దాంతోపాటు పలు యాక్షన్ సన్నివేశాలు కూడా అక్కడ ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో ప్రతినాయకుడి గా నటిస్తున్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఓ ప్రమాదంలో గాయాలపాలు కావడంతో ఆయన కొద్దిరోజులుగా రెస్ట్‌లో ఉన్నారు. కోలుకుని సెట్‌లో అడుగు పెట్టడానికి ఇంకాస్త సమయం పడుతుందని సమాచారం. ఆయన కోసమే షూటింగ్‌కు కాస్త గ్యాప్ ఇచ్చారు. ఆలస్యం కావడంతో ప్రస్తుతం తారక్‌తోపాటు ఇతర తారాగణంపై గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రెండు భాగాలుగా ప్లాన్ చేసిన ఈ చిత్రం మొదటి పార్ట్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ పలు కారణాల చేత అక్టోబర్ 10 తేదీకి వాయిదా పడింది. ఇందులో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే ఆమెపై కీలక సన్నివేశాలు షూట్ చేశారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యుదసుధా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. దేవి శ్రీ ప్రసాద్ నిర్మిస్తున్నారు.

# అందాల ఆరబోతలో పోటీపడుతున్న రాశీఖన్నా



టాలీవుడ్ సుందరి రాశీ ఖన్నా అందాల ప్రదర్శనలో ఏమాత్రం తగ్గడం లేదు. రోజురోజు అంతకుమించి అనేలా దూసుకెళుతుందే తప్పితే ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్‌ను సైడ్‌కు పెట్టి పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి పెట్టిన ఈ ముద్దుగుమ్మ అక్కడ పోటీలో నిలబడేందుకు, అవకాశాలు పట్టేయడానికి గ్లామర్ డోస్ పెంచుతూ పోతూ ఇక్కడ కుర్రాళ్ల గుండెల్లో మంటలు పెడుతోంది.వారం రోజుల క్రితం అసలు బట్టలు ఉన్నాయా లేవా అనే విధంగా బట్టలు వేసుకుని ఫొటోషూట్లు చేసిన ఈ చిన్నది.. మళ్లీ ఇప్పుడు అదే స్థాయిలో అందాల ప్రదర్శన చేసి అభిమానులకు కనులవిందు చేసింది.తాజాగా రెడ్ అవుట్ ఫిట్‌లో డ్రెస్‌ను జార విడిచి మరి అందాలను చూపిస్తూ మెస్మరైజ్ చేసింది. దీంతో అభిమానులు సినిమాలు లేకున్నా ఫర్లేదు మూడు రోజులకోసారి ఈ మాత్రం దర్శనం ఇస్తే చాలు అనేంత వరకు ఫ్యాన్స్ వెళ్లి పోయారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో సిద్ధార్థ్ మల్హోత్రా తో కలిసి యోధ అనే వార్ ఓరియంటెడ్ సినిమాలో నటించగా అది త్వరలో విడుదలకు రెడీ అయింది. ఇక తెలుగులో డీజే టిల్లు స్టార్ జొన్నలగడ్డ సిద్దుతో కలిసి చేస్తున్న తెలుసుకదా అనే చిత్రం తప్పితే మరో చిత్రానికి సంతకం చేయలేదు.ఇక హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ పార్ట్2 లో నటించనుంది.

# భారతీయ ఆటగాళ్లతో రింకూ సింగ్ స్టేడియంలో ఫొటో షూట్




భారత్-ఇంగ్లండ్ మధ్య చివరి టెస్టుకు ముందు సిక్సర్ల రింకూ సింగ్ ధర్మశాల చేరుకున్నాడు. మార్చి 4న అతను టీమిండియా ఆటగాళ్లతో కనిపించాడు. టెస్టు సిరీస్‌లో రింకూ టీమ్ ఇండియాలో భాగం కాదు. అతను దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్ట్ జట్టుతో చేరాడు. కానీ, ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు ఎంపిక కాలేదు. భారత్-ఇంగ్లండ్ సిరీస్‌లో అతను ఉత్తరప్రదేశ్ తరపున రంజీ ట్రోఫీలో ఆడుతున్నాడు. ఇటువంటి పరిస్థితిలో, ధర్మశాల టెస్టుకు ముందే రింకూ సింగ్ టీమిండియాలో ఎందుకు చేరాడు? అని అంతా మాట్లాడుకుంటున్నారు. రింకూ సింగ్ నిజానికి %ు%20 వరల్డ్ కప్ 2024 కోసం ఒక పనికి సంబంధించి ధర్మశాల చేరుకున్నాడు. మార్చి 3న చివరి టెస్టు కోసం భారత జట్టు ధర్మశాలకు వచ్చింది. ఈ క్రమంలో మార్చి 4న వారికి సెలవు ఉంది. ఈ సందర్భంగా టీ20 ప్రపంచకప్‌లో ప్రాబబుల్ ఆటగాళ్ల ఫొటో షూట్ జరిగింది. ఇలాంటి పరిస్థితిలో రింకూని కూడా బీసీసీఐ పిలిచింది. %ు%20 ప్రపంచ కప్ కోసం భారత జట్టు ఇంకా ప్రకటించలేదు. కానీ, ఈ టోర్నమెంట్‌లో ఆడటానికి రింకూ అతిపెద్ద పోటీదారుడిగా ఉన్నాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌లో, ఆ తర్వాత టీమ్ ఇండియాలో ఫినిషర్ పాత్రలో తానేంటో నిరూపించుకున్నాడు. ఈ కారణంగా, అతను ఇతర భారతీయ ఆటగాళ్లతో స్టేడియంలో ఫొటో షూట్ చేశాడు. జూన్ 2024లో వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా %ు%20 ప్రపంచ కప్‌ను నిర్వహించనున్నాయి. ఇందులో భారత్‌కు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని స్పష్టమైంది. హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నీకి భారత జట్టును మే ప్రారంభంలో ప్రకటించనున్న సంగతి తెలిసిందే. భారత ఆటగాళ్లు రెండు భాగాలుగా టీ20 ప్రపంచకప్‌కు వెళ్లవచ్చు. ఐపీఎల్ ప్లేఆఫ్ రేసులో ఏ జట్లు ఔట్ అవుతాయో ఆ ఆటగాళ్లు ముందుగా వెళ్తారు. ప్లేఆఫ్స్‌కు వెళ్లే జట్ల నుంచి ఎంపికైన ఆటగాళు చివరిగా వెళ్తారు. టోర్నీలో భారత్ తొలి మ్యాచ్ ఐర్లాండ్‌తో జూన్ 5న జరగనుంది. రింకూ సింగ్ భారత్ తరపున ఇప్పటి వరకు 15 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో 89 సగటు, 176.23 స్ట్రైక్ రేట్‌తో 356 పరుగులు చేశాడు. అతని బ్యాట్ నుంచి రెండు అర్ధ సెంచరీలు వచ్చాయి. అందులో 69 నాటౌట్ అత్యధిక స్కోరుగా నిలిచింది. ఈ ఫార్మాట్‌లో భారత్ తరపున 31 ఫోర్లు, 20 సిక్సర్లు కొట్టాడు. 26 ఏళ్ల రింకూ టీమ్ ఇండియా తరపున రెండు వన్డేలు కూడా ఆడాడు. అందులో అతను 55 పరుగులు చేశాడు. ప్లేయింగ్-11లో రింకూ సింగ్ చేరితే భారత జట్టుకు మరింత బలం చేకూరుతుంది. రింకూ పరిమిత ఓవర్ల గేమ్‌లలో అత్యుత్తమ ఫినిషర్‌గా నిరూపించుకున్నాడు. రింకూ చివరి మ్యాచ్ ఆడితే, అతను తన బ్యాట్‌తో ఇంగ్లండ్ బేస్ బాల్ గేమ్‌కు తగిన సమాధానం ఇవ్వగలడు. రజత్ పాటిదార్ స్థానంలో రింకూను జట్టులోకి తీసుకోవచ్చునే సమాచారం కూడా అందుతోంది.

ధర్మశాలలో 5వ టెస్టుకు భారత జట్టు:
రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), కెఎస్ భరత్ (వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, ఆర్. అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్.

## 13 ఏళ్ల కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ ఇదే

భారత సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన కెరీర్‌లో మలుపు తిరిగిన విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో ధర్మశాలలో మార్చి 7 నుంచి ప్రారంభమయ్యే సిరీస్‌లో 5వ, చివరి టెస్ట్ మ్యాచ్ ద్వారా అశ్విన్ తన కెరీర్‌లో 100 టెస్టులను పూర్తి చేయనున్నాడు. 2012లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్ తన కెరీర్‌లో కీలక మలుపు తిరిగిందని, అదే తన తప్పులను సరిదిద్దుకోవడానికి దోహదపడిందని మంగళవారం తెలిపాడు. ఇంగ్లండ్ ఆ సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. ఇది 1984-85 తర్వాత భారత్‌లో ఆ జట్టుకు మొదటి సిరీస్ విజయం. ఇంగ్లండ్‌తో జరిగిన 4 టెస్టుల సిరీస్‌లో అశ్విన్ 14 వికెట్లు పడగొట్టాడు. తన 100వ టెస్టు మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో అశ్విన్ మాట్లాడుతూ, 'ఇంగ్లండ్‌తో జరిగిన 2012 సిరీస్ నాకు టర్నింగ్ పాయింట్. నేను ఎక్కడ మెరుగుపడాలో అది నాకు చెప్పిందంటూ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇదో పెద్ద అవకాశం. గమ్యం కంటే ప్రయాణం చాలా ప్రత్యేకమైనది. నా ప్రిపరేషన్‌లో ఎలాంటి మార్పు లేదు. టెస్ట్ మ్యాచ్ గెలవాలి. అశ్విన్ తన కెరీర్‌లో అత్యుత్త మ స్పెల్ గురించి కూడా మాట్లాడాడు. అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన గురించి అడిగినప్పుడు, '2018-19లో బర్మింగ్‌హామ్‌లో నా టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమ స్పెల్‌ను సాధించాను' అంటూ చెప్పుకొచ్చాడు. ఇటీవల, అనిల్ కుంబ్లే తర్వాత 500 టెస్టు వికెట్లు పూర్తి చేసిన రెండో భారత బౌలర్‌గా నిలిచాడు. అశ్విన్ 2011లో టెస్టు క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. 100 టెస్టు మ్యాచ్‌లు ఆడిన 14వ భారత క్రికెటర్‌గా అశ్విన్ నిలిచాడు. అంతకుముందు, ఛతేశ్వర్ పుజారా గతేడాది ఢిల్లీలో భారత్ తరపున 100వ టెస్టు ఆడాడు. అశ్విన్ ఇప్పటివరకు 99 టెస్టు మ్యాచ్‌లు ఆడి 23.91 సగటుతో 507 వికెట్లు తీశాడు. టెస్టుల్లో 500కి పైగా వికెట్లు తీసిన రెండో భారతీయుడిగా అశ్విన్ నిలిచాడు.

### తోటి క్రీడాకారిణి డబ్బు దొంగిలించిన

# పాకిస్తాన్ బాక్సర్!



విదేశాలకు వెళ్లిన ఓ పాకిస్థాన్ బాక్సర్ ఎవరూ ఊహించని పని చేశాడు. సహచర క్రీడాకారిణి బ్యాగ్ నుండి డబ్బు దొంగిలించి.. అక్కడినుంచి పరార్ అయ్యాడు. ఈ విషయాన్ని పాకిస్థాన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఫెడరేషన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ విషయాన్ని ఇటలీలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని, ఈ ఘటనపై పోలీసు నివేదికను కూడా దాఖలు చేశామని ఫెడరేషన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటన పాకిస్తాన్ క్రీడావిభాగంలో చర్చనీయాంశం అయింది. ఒలింపిక్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాకిస్తాన్ ఐదుగురు సభ్యుల జట్టుతో ఇటలీకి వెళ్లింది. ఈ జట్టులో జోహెబ్ రషీద్ ఓ సభ్యుడు. పాక్ జట్టు సభ్యురాలైన లౌరా ఇక్రామ్ శిక్షణ శిబిరానికి వెళ్లగా.. కోచ్ అర్షాద్ హుస్సేన్ టోర్నీ ప్రారంభోత్సవానికి వెళ్లారు. వాతావరణం చల్లగా ఉందని చెప్పి.. రషీద్ శిక్షణకు డుమ్మా కొట్టి గదిలో ఉన్నాడు. సహచరులు వెళ్లిపోయాక ఫ్రంట్ డెస్క్ నుంచి తాళాలు తీసుకొని.. ఇక్రామ్ గదికి రషీద్ చేరుకొన్నాడు. ఇక్రామ్ పర్స్‌లోని విదేశీ కరెన్సీని తీసుకొన్న రషీద్.. హొటల్ నుంచి అదృశ్యమయ్యాడు. అతడు పాస్‌పోర్టు కూడా తీసుకెళ్లాడు. రషీద్ వీసాకు నెల రోజుల గడువు ఉంది. ఈ ఘటనపై పాకిస్తాన్ బాక్సింగ్ ఫెడరేషన్ సెక్రటరీ కర్నల్ నజీర్ అహ్మద్ స్పందించారు. 'తోటి క్రీడాకారిణి డబ్బును జోహెబ్ రషీద్ దొంగిలించాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇటలీలోని పాక్ దౌత్య కార్యాలయానికి సమాచారం ఇచ్చాం. రషీద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటివరకు ఎవరితోనూ అతడు కాంటాక్ట్‌లోకి రాలేదు. రషీద్ దేశానికి తలవంపులు తీసుకొచ్చాడు' అని నజీర్ అహ్మద్ అన్నాడు. రషీద్ గతేడాది జరిగిన ఆసియాన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. పాక్‌లో ఎదుగుతున్న బాక్సర్లలో అతడు ఒకడు. ఒలింపిక్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌లో ఆదివారం శరణార్థుల బృందానికి చెందిన ఒమిద్ అహ్మదీసఫాతో అతడు తలపడాల్సి ఉంది. రషీద్ అదృశ్యం అవ్వడంతో పాకిస్థాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

# కెరీర్ వందో టెస్టులో మెరిసేదెవరో?

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల ఆఖరిదైన టెస్టు మ్యాచ్ ధర్మశాలలో మార్చి 7 నుంచి ఆరంభం కానుంది. ఇప్పటికే సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకున్న భారత్.. ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించాలని చూస్తోంది. ఇప్పటికే సిరీస్ చేజార్చుకున్న ఇంగ్లీష్ జట్టు మంచి గెలుపుతో స్వదేశానికి వెళ్లాలని భావిస్తోంది. అయితే ఈ టెస్ట్ మ్యాచ్ టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టోలకు ప్రత్యేకంగా నిలవనుంది. ఈ ఇద్దరికీ ఇది కెరీర్‌లో వందో టెస్టు. ఇటీవలే టెస్టుల్లో 500 వికెట్ల ఘనత అందుకున్న ఆర్ అశ్విన్.. కెరీర్‌లో 100వ టెస్టు ఆడడానికి సిద్ధంగా ఉన్నాడు. 2011లో సుదీర్ఘ ఫార్మాట్లో అరంగేట్రం చేసిన అశ్విన్.. 13 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఒంటిచేత్తో భారత్‌కు ఎన్నో విజయాలు అందించాడు. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లో జట్టుకు అండగా ఉంటున్నాడు. ఇప్పటివరకు 99 టెస్టులు ఆడి.. 507 వికెట్స్ పడగొట్టాడు. మరోవైపు 3309 రన్స్ కూడా చేశాడు. ఇందులో 5 సెంచరీలు ఉండడం విశేషం. మరోవైపు జానీ బెయిర్‌స్టో 99 టెస్టులో 5974 రన్స్ చేశాడు. కెరీర్‌లో 100వ టెస్ట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఈ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకోవడంలో ఆర్ అశ్విన్‌ది కీలకపాత్ర అని చెప్పాలి. 4 టెస్టుల్లో 17 వికెట్లు తీసిన యాష్.. బ్యాటింగ్‌లోనూ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. రాంచీలో జరిగిన నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మూడో టెస్టు మధ్యలో వ్యక్తిగత కారణం తో జట్టును వీడిన అశ్విన్.. వెంటనే తిరిగి వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఈ సిరీస్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన యాష్.. ఆఖరి టెస్టులోనూ తన మార్కు చూపించాలని చూస్తున్నాడు. ఈ సిరీస్‌లో జానీ బెయిర్‌స్టో ఇప్పటిదాకా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో తడి అత్యధిక స్కోరు 38 మాత్రమే. 100వ టెస్టులో అయినా సత్తా



చాటాలని చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో వందో టెస్టులో మెరిసేదెవరో చూడాలి.

## రెండో రౌండ్‌కు చేరిన సాత్విక్-చిరాగ్, ట్రీసా-గాయత్రి జోడీ



ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి మంగళవారం మలేషియాకు చెందిన ఓంగ్ యూ సిన్, టియో ఈయి జోడీపై వరుస గేమ్‌లల్లో విజయం సాధించారు. దీంతో భారత జోడీ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. సాత్విక్, చిరాగ్ జోడీ ప్రపంచ నం. 1 ర్యాంక్‌ను 2022లో క్లెయిమ్ చేశారు. మంగళవారం ఆసియా క్రీడల ఛాంపియన్‌లు ప్రపంచ నం. 12 మలేషియా జోడీపై 21-13, 24-22తో 47 నిమిషాల్లో చివరి ఎనిమిది గేమ్స్‌ల్లో ఐదో విజయం సాధించింది. తమ గత మూడు టోర్నీల్లో రెండో అత్యుత్తమ స్థానంలో నిలిచిన సాత్విక్, చిరాగ్ తదుపరి రౌండ్‌లో మరో మలేషియా జోడీ మాన్ వీ చోంగ్, కై వున్ టీతో తలపడనున్నారు. కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేతలైన ట్రీసా జాలీ, గాయత్రీ గోపీచంద్ కూడా మహిళల డబుల్స్‌లో ఆల్-ఇండియన్ ఓపెనింగ్ మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టోపై 16-21, 21-19, 21-17 తేడాతో విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఈ రెండు జోడీలు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు పోరాడుతున్నాయి. తనీషా-అశ్విని 11వ ర్యాంక్‌లో ఉండగా, ట్రీసా-గాయత్రి ఒలంపిక్ గేమ్స్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో నిలిచారు. గత నెలలో మలేషియాలోని షా ఆలమ్‌లో జరిగిన బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించిన ట్రీసా, గాయత్రి జోడీ రెడ్-హాట్ ఫామ్‌లో ఉన్నారు.




EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com